




కొల్లూరు మండలం ధోనేపూడి వద్ద నేలవాలిన వరిపైరు

వర్షం.. కష్టం

- పలు చోట్ల నేలవాలిన వరి
- రైతులను వెంటాడుతోన్న ఫెంగల్
- తుఫాన్ ప్రభావంతో అన్నదాతల్లో ఆందోళన
- మొలకలు వచ్చే అవకాశం ఉండడంపై అన్నదాతల ఆవేదన



కొల్లిపర మండలం చివలూరులో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాదసూచిక ఎగురవేత



కొల్లూరు : ధాన్యంపై కప్పిన పట్టాలపై నిలిచిన వర్షపు నీరు

బాపట్ల, కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అననుకూల పరిస్థితులను అధిగమించారు. భారీ వర్షాలు.. వరదలను ఎదిరించారు. తెగుళ్లను తట్టుకున్నారు. పంట చేతికి వచ్చేసింది. ఇక కోతలే అనుకుంటున్న తరుణంలో ఫెంగల్ తుఫాన్ రైతన్నల వెన్నులో వణుకుపుట్టిస్తోంది. పంట కొత్తకు వచ్చిన సమయంలో వరుణుడు దోబూచులాడుతుండడంతో అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం చిరు జల్లులకే పరిమితమైన వాన శనివారం రేపల్లె, బాపట్ల, వేమూరు ప్రాంతాల్లో ఓ మోస్తరుగా కురిసింది. దీంతో వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గతంలో వచ్చిన ప్రకృతి విపత్తులతో ఇప్పటికే కుదేలై ఉన్న సమయంలో అరకొరగా చేతికొచ్చే పంట కూడా దక్కకుండా పోతుందేమోనన్న బెంగ రైతులను వెంటాడుతున్నది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు దాదాపు 30,000 ఎకరాల్లో నేలవాలింది. వర్షాలు ఎక్కువైతే పంటంతా తుడిచిపెట్టుకు పోవడం ఖాయంగా ఉంది. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని వర్షం భయంతో బస్తాల్లోకి ఎత్తి ఉంచారు. రెండు రోజుల క్రితం యంత్రాలతో కోత కోయగా వచ్చిన ధాన్యాన్ని రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసుకుని ప్లాస్టిక్ పట్టాలతో భద్రపరుచుకున్నప్పటికీ వర్షానికి చెమ్మ చేరింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 8,000 ఎకరాల్లో కోతలు పూర్తి కాగా ఇందులో 6,000 వరకు వేమూరు నియోజకవర్గ పరిధిలోనే ఉంది. ఈ కోతలకు సంబంధించి 600 టన్నుల వరకు ధాన్యమే కొనుగోలు కేంద్రాలకు చేరగా, 2,000 టన్నుల వరకు రైతులు భద్రపరుచుకున్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. వాన భయంతో నష్టానికి అన్నదాతలు బహిరంగ మార్కెట్‌లో దాదాపు 2,000 టన్నుల ధాన్యం విక్రయించుకున్నట్లు సమాచారం.

హార్బర్‌లో మూడో నెంబర్ ప్రమాద సూచిక

రేపల్లె: తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంది. ఫెంగల తుఫాన్ కారణంగా శనివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని వెళ్ళిన వారు ఒడ్డుకు చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. వేటకు వెళ్లిన బోట్లలో ఇప్పటికే 90 శాతం హార్బర్‌కు చేరుకున్నాయి.



కొల్లిపర మండలం చివలూరు సమీపంలో వరికుప్పకు పట్టాలు కప్పుతున్న రైతులు

వర్షాలు ఎక్కువైతే ఇబ్బందే..

కొల్లిపర మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాలతో పాటు తీర ప్రాంత గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి దఫదఫాలుగా కురిసిన వర్షానికి, గాలులకు నిలువు మీద ఉన్న వరి పైరు నేలవాలింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 2.40 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా ఇందులో 80 శాతం వరకు వరిపైరు కోతకు సిద్ధంగా ఉంది. వేమూరు, రేపల్లెతో పాటు బాపట్ల నియోజకవర్గ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో వారం క్రితమే కోతలు మొదలయ్యాయి. తుఫాన్ హెచ్చరికలతో మరింతమంది కోతలు చేపట్టారు. పంట కోసిన వారి వెతలు ఒకవిధంగా ఉంటే పొలంమీద ఉన్న పైరు నేలవాలి రైతులను మరింత కలవరపెడుతోంది. నేలవాలిన పైరు ఎక్కువ రోజులు కోయకుండా ఉంటే మొలకెత్తడంతో పాటు ధాన్యం రంగుమారుతుందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. శనివారం కురిసిన ఓ మాస్తరు వర్షంతో తుఫాన్ ప్రమాదం తప్పితే స్వల్ప నష్టంతో రైతులు బయటపడే అవకాశం ఉంది. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు నమోదైతే మాత్రం అన్నదాతలు కోలుకోలేని విధంగా నష్ట పోవడం ఖాయం. ఎకరాకు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు పెట్టుబడి పెట్టామని వర్షం భారీగా పడితే పంటంతా నీటిపాలయ్యే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.



కొల్లిపర మండలం అత్తోటలో వర్షానికి తడిచిన వరి ఓదెలు

ప్రజాభిప్రాయంతోనే..



- అమరావతి ప్రతి నిర్మాణంలోనూ ప్రజా భాగస్వామ్యం
- సీఆర్‌డీఏ కార్యాలయ నమూనాలపై ప్రజాభిప్రాయ సేకరణ



- పది డిజైన్లను వెబ్‌సైట్‌లో ఉంచి ఓటింగ్ కోరిన సీఆర్‌డీఏ
- మెజారిటీ ఓటింగ్ ప్రకారమే ప్రాజెక్టు ఆఫీసు నమూనా ఎంపిక
- సర్వర్ స్పీడుతో 96 శాతానికి పైగానే
- వేకువజామున 6 గంటలకు ప్రారంభం

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో తలపెట్టే ప్రతి పనికీ ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధానిలో చేపట్టే ఏ పనైనా, ప్రాజెక్టు నిర్మాణాలైనా ప్రజల ఆకాంక్షలు, సూచనల మేరకు ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సీఆర్‌డీఏ అధికారులు అమల్లోకి తీసుకువచ్చారు. రాజధానిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్స్ ఎలా ఉండాలన్న దానిపై సీఆర్‌డీఏ ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. ముందుగా తమ సొంత ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్లు ఎలా ఉండాలన్న దానిపై ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసుకు సంబంధించి రూపొందించిన మొత్తం 10 డిజైన్లను సీఆర్‌డీఏ అధికారులు తమ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ పది డిజైన్లలో ఏది నచ్చిందో ఓటు వేసే పోల్ ఆప్షన్ ఇచ్చారు. వరుస క్రమంలో పది నమూనాలు ఉంటాయి. ఈ నమూనాలను జూమ్ చేసుకుని చూసే సదుపాయాన్ని కూడా కల్పించారు. నచ్చిన డిజైన్‌ను ఎంచుకోవాలి. డిజైన్‌ను ఎంచుకున్న తర్వాత పేరు, విద్యార్హతలు, ఫోన్ నెంబర్, రివ్యూ కోరుతూ ఒక పాపప్ వస్తుంది. అవన్నీ పూర్తి చేసిన తర్వాత సబ్‌మిట్ చేయాలి. శనివారం మధ్యాహ్నం దీనిని అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచారు. దీనిపై ఇంకా ప్రచారం కూడా చేపట్టకపోయినా.. సాయంత్రం 5 గంటలకి 438 మంది ఓటింగ్ వేశారు. ఆదివారం నుంచి సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్లకు ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ పది డిజైన్లలో దేనికి మెజారిటీ ఓటింగ్ వస్తుందో ఆ డిజైన్‌నే సీఆర్‌డీఏ అధికారులు ఎంపిక చేస్తారు.

పింఛన్లు.. చకచకా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వంలో సామాజిక పింఛన్లను ఠంచన్‌గా పంపిణీ చేస్తున్నది. డిసెంబరు నెలకు సంబంధించి పింఛన్లను ఒక రోజు ముందుగానే శనివారం పంపిణీ జరిగింది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తెలవారుతుండగానే లబ్ధిదారుడి ఇంటి తలుపుతట్టి మరీ నగదును సచివాలయ సిబ్బంది అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 5 గంటలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఆ సమయంలో సర్వర్ స్పీడ్‌గా రెస్పాన్స్ కావడంతో చకాచకా పంపిణీని చేపట్టారు. సచివాలయ, ఇతర ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో భాగస్వామలయ్యారు. ఒక్క రోజులోనే 95 శాతం పంపిణీ జరిగింది. జిల్లావ్యాప్తంగా కూటమి పార్టీల శ్రేణులు కూడా పంపిణీలో భాగస్వాములయ్యారు. ఒక్క రోజు ముందే పింఛన్ పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. గడచిన రెండు, మూడు నెలలుగా పింఛన్ తీసుకోని వారిని కూడా గుర్తించిన దాదాపు 800 మందికి కూడా ఇంటింటికి వెళ్లి పాత బకాయిలు కూడా అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై మూడో నెలలకు ఒకసారి కూడా మొత్తం పింఛన్‌ని తీసుకోవచ్చని సచివాలయాల సెక్రెటరీలు తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా టంఛన్‌గా ప్రతీ నెలా ఒకటో తేదీ, ఒకవేళ ఆ రోజు సెలవు అయితే ముందురోజే పింఛన్ పంపిణీ చేస్తుండటంపై పెన్షనర్లు ఆనందోత్సాహాలు వ్యక్తపరుస్తు న్నారు. గతంలో ఒకటో తేదీ సెలవు వస్తే తర్వాత తేదీకి వాయిదా వేసేవారని, దాంతో అనేక ఇబ్బందులు పడేవారమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పింఛన్ అందుకుంటున్న వారి సంఖ్య 2,28,615 మంది ఉండగా, వీరిలో 95 శాతం మందికి పింఛన్‌ను శనివారమే అందించారు. మిగిలిన వారు అందుబాటులో లేకపోవడం వల్లే పెండింగ్ ఉన్నట్లు అధికారులు చెప్పారు.



చుండూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఐఆర్‌ఈఎఫ్ కళాశాల బస్సు దగ్ధం
- డ్రైవర్ అప్రమత్తతతో బస్సులో 30 మంది విద్యార్థులు క్షేమం
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

6

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న జడ్పీ సీఈవో
- 2024-2025 వార్షిక సవరణ బడ్జెట్‌కు ఆమోదం



విద్యార్థినులతో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా

విద్యార్థినుల ఆందోళనపై త్రిసభ్య కమిటీ

- తక్షణం స్పందించిన ప్రభుత్వం.. విచారణకు ఆదేశాలు
- నేటి మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ విచారణ
- వర్సిటీ వసతి గృహ హెడ్‌కుక్, కుక్‌ల సస్పెన్షన్

పెదకాకాని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భోజనంలో పురుగులు, కప్పలు, జర్రెలు వస్తున్నాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యార్థినులు శుక్రవారం రాత్రి చేపట్టిన ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సీఎం ఆదేశాలతో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ రామ్మోహన్‌రావు శనివారం వర్సిటీలో పర్యటించారు. విద్యార్థినుల వసతిగృహం, మెస్ గదులు, భోజనశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. వర్సిటీలోని ఉదంతంపై తక్షణమే విచారణ చేపట్టాలని త్రిసభ్య కమిటీని శనివారం నియమించింది. వాస్తవాలను విచారించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కమిటీలోని అధికారులు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, గుంటూరు డీఎస్‌వో పద్మజ, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి రవీందర్‌రెడ్డి శనివారం వర్సిటీలో పర్యటించారు. తొలుత వీసీ చాంబర్‌లో గంగాధరరావుతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థినుల వసతి గృహాలకు వెళ్లి భోజనశాల, వంటగదులు, మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు వారి సమస్యలను అధికారులకు తెలిపారు. భోజనం అపరిశుభ్రంగా ఉంటుందని, రుచి, సుచి లేకుండా ఉండటం వల్ల తినలేక పోతున్నామని చెప్పారు. వసతి గృహాల నిర్వహణ సరిగా లేదని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని ఫిర్యాదు చేశారు. పిల్లులు ముట్టిన పాలు, పెరుగును వడ్డిస్తున్నారని తెలిపారు. నాణ్యతలేని ఆహార పదార్థాలు, కల్తీ నూనెలు, నాసిరకం సరుకులు వంటకు వాడుతున్నారన్నారు. వర్సిటీలో విద్యార్థినుల ఇబ్బందులు, వారి సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు విద్యార్థినుల వసతి గృహంలోని రీడింగ్ రూమ్‌లో విచారణ చేపట్టనున్నట్లు విచారణ అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా విలేకరులకు తెలిపారు.

సిబ్బందిపై వేటుతో సరి

వర్సిటీలోని మెస్‌లో తయారు చేసే భోజనంలో పురుగులు రావడం, వంట అశుభ్రంగా ఉండటంపై స్పందించిన వర్సిటీ అధికారులు విద్యార్థినుల వసతి గృహ హెడ్ కుక్, కుక్‌లను సస్పెండ్ చేశారు. చీఫ్ వార్డెన్ వెంకటరత్నంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం ఏమిటని వర్సిటీ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి.

ముందస్తుగానే పింఛన్లు పంపిణీ

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్బయ్యతోట ప్రాంతంలో పలువురు వృద్ధులకు, వితంతువులకు ఇళ్లకు వెళ్లి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పింఛన్ నగదును లబ్ధిదారులకు అందించారు. శనివారం పట్టణంలోని పలు కార్యక్రమాలకు హాజరైన కేంద్ర మంత్రి చంద్రశేఖర్ ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ 1వ తేదీ రాక ముందే ఆదివారాన్ని దృష్టిలో ఉంచుకొని ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేశామని, అలాగే మూడు నెలల పింఛన్ ఒక్కసారే ఇవ్వటం ఈ ప్రభుత్వానికి పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. రూ.4 వేలకు పింఛన్‌ను పెంచటం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని పలువురు లబ్ధిదారులు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేట మండలంలోని మానుకొండవారిపాలెం గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహణ కార్యదర్శి షేక్ కరిముల్లా, నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పెమ్మసాని, లావు, ప్రత్తిపాటి, మానం వెంకటేశ్వర్లు

రాష్ట్రంలోని కేజీబీవీలలో సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు

సత్తెనపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని కేజీబీవీలలో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 352 కేజీబీవీలలో లక్షా ఆరు వేల మంది విద్యార్థులు ఆరు నుంచి ఇంటర్ వరకు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. 14వేల మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారన్నారు. పంచతంత్ర ప్రణాళిక ద్వారా 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ఉపాధ్యాయులు ఒక ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నారన్నారు. సిలబస్ పూర్తయిందని, ఏ రోజు ఏం చదవాలి అనే దానిపై ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రణాళికను అందించామన్నారు. గతేడాది 10వ తరగతిలో విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ సంవత్సరం నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించామన్నారు. అన్ని కేజీబీవీలలో రాష్ట్ర వ్యాప్తంగా 22వేల మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారన్నారు. వీరు కూడా నూటికి నూరుశాతం పరీక్షల్లో ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించి చదివిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు.


దేవానందరెడ్డి

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ఎండ్రాయి చివారు ప్రాంతం కర్లపూడి వడ్డమాను డొంక సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లగా సుమారు 20రోజులకు పైగా మృతి చెందినటువంటి కుళ్లిపోయిన మృతదేహం ఉంది. మృతదేహంపై ఉన్న బట్టలు కూడా గుర్తుపట్టలేనంతగా నల్లగా మారిపోయాయి. వ్యక్తి మృతికి సంబంధించి పూర్తి ఆధారాలు సేకరించేందుకు గుంటూరులోని మార్చురీకి తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9274 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5087 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 20,909 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 37,970 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 37,970 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.75 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,585 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి ఆకస్మిక మృతి



తాడేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి (78) శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. యథావిధిగా శనివారం ఉండవల్లిలో కృష్ణానది వద్ద ఈతకు వెళ్లిన సుబ్బారెడ్డి గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి మధు, సుబ్బారెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా సుబ్బారెడ్డి మృతదేహాన్ని ఎన్నారై వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఇవ్వడానికి, కళ్లను హైదరాబాద్‌లోని ఎల్‌వీఆర్ కంటి ఆసుపత్రికి ఇవ్వడానికి కుటుంబసభ్యులు నిర్ణయించారు. సుబ్బారెడ్డి మృతి పట్ల సీపీఎం నేతలు సీహెచ్ బాబూరావు, జొన్నా శివశంకర్, పాశం రామారావు, ప్రజాసంఘాల నేతలు, ప్రజానాట్యమండలి కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

వంటలో నాణ్యతా లోపాలు

● ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు

పెదకాకాని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని విద్యార్థినుల హాస్టల్లో చేస్తున్న వంటలో నాణ్యత లోపాలు ఉన్నాయని ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు తెలిపారు. వర్సిటీలో విద్యార్థినుల ఆందోళనపై సమగ్ర విచారణ జరిపేందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు వర్సిటీకి వచ్చారు. శనివారం వర్సిటీలోని విద్యార్థినుల హాస్టల్ గదులు, మెస్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థినిలకు సంబంధించిన భోజనశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థినుల భోజనశాలలో అపరిశుభ్ర పరిస్థితులు ఉన్నాయన్నారు. దీనినే ప్రాథమిక విచారణ కింద చేపట్టి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి భరత్ గుప్తా, గుంటూరు ఆర్డీవో కమ్మ శ్రీనివాసరావు, పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నంలో కప్పలు.. జెర్రులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల హాస్టల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. భోజనం బాగోటలేదనీ, అన్నంలో పురుగులు, జెర్రులు, ఈగలు ఉంటున్నాయని విద్యార్థినులు 20 రోజుల క్రితమే వర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారి గోడు పట్టించుకోలేదు. పైగా ఎవరైతే ఫిర్యాదు చేశారో వారిపై వర్సిటీ ఉన్నతాధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా భోజనం సక్రమంగా లేదని పస్తులు ఉంటున్నారు. గత్యంతరం లేక విద్యార్థినులు ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. ఆదివారం ప్రభుత్వ విచారణ కమిటీ ముందు విచారణకు సైతం విద్యార్థినులు ఎవరూ హాజరు కావద్దని, కొంతమంది మాత్రమే వచ్చి అంతా బాగా ఉందని చెబుతారనీ, ఎవరైతే మా ఆదేశాలు పాటించకుండా వ్యవహరిస్తారో వారిని అన్ని విధాలుగా పరీక్షలు తప్పిస్తామని ఉన్నతాధికారి బెదిరిస్తున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. నేడు తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ విచారణకు వర్సిటీలోని హాస్టల్ విద్యార్థినులు ఎవరూ హాజరు కావద్దని ఆయా విభాగ అధిపతులు విద్యార్థినులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో కమిటీ ముందు వాస్తవాలు వెల్లడించేందుకు వెనకడుగు వేస్తున్నట్టు తెలిసింది.


వర్సిటీలో అపరిశుభ్రంగా ఉన్న పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

బయట ఆహారం కోసమే ఆందోళన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో భోజనం బాగోలేదు అని విద్యార్థులు ఆందోళన చేపట్టారనీ, అందుకు ప్రధాన కారణం బయట ఫుడ్‌కు అనుమతి ఇవ్వమంటున్నారని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బయట ఫుడ్ కోసమే విద్యార్థినులు ఆందోళన చేపడుతున్నారని ఆయన తెలిపారు. అయితే బయట ఆహారానికి కూడా అనుమతిస్తున్నామని, ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8:30 వరకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. అది కూడా పార్సిల్ తెచ్చిన వారిని లోపలికి అనుమతి ఇవ్వకుండా, కేవలం గేటు వద్ద సెక్యూరిటీ వారికి అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినిలు చెబుతున్నట్లు భోజనంలో పురుగులు వచ్చినట్లు మా వద్ద కూడా సాక్ష్యాలు ఉన్నాయని, కానీ జెర్రీలు, కప్పలు వచ్చినట్లు ఆధారాలు లేవన్నారు.

విజ్ఞాన్ వర్సిటీలో ముగిసిన జాతీయస్థాయి సదస్సు

● పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

గుంటూరు(విద్య), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అప్‌సైక్లింగ్ సహాయంతో ప్లాస్టిక్‌ను క్రియేటివ్‌గా మార్చి అధిక విలువ కలిగిన వస్తువులుగా తయారు చేయడం వలన పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థకు కూడా దోహదం చేస్తుందని ఐఐఎస్‌సీ బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ ఆచార్య సూర్యసారథి బోస్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెర్బ్ ఇండియా ఏఎస్ఆర్ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్‌సీఎఫ్‌పీఎస్‌టీ-2024)' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి సదస్సు శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య సూర్యసారథి బోస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ వలన ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించి సమీప ప్రదేశాలను శుభ్రంగా ఉంచే అవకాశం ఉందన్నారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన పూణెలోని హెచ్‌ఈఎంఆర్‌ఎల్ డీఆర్‌డీవో సైంటిస్ డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణన్ మాట్లాడుతూ హైఎనర్జీ మెటీరియల్స్‌లో రసాయన సంక్లిష్టతలు గుణాత్మకంగా డిజైన్ చేయడం ద్వారా తక్కువ పరిమాణంలో ఎక్కువ శక్తిని విడుదల చేయగల సామర్థ్యం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో వేలూరులోని తిరువల్లువర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ రీసెర్చ్ డైరక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, హెడ్ కే.దినకరన్, హైదరాబాద్‌లోని ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ కేఎస్ఎస్.రాజు, విశాఖపట్నంలోని ఐఐపీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ గుప్త చందలూరి, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆచార్య సూర్యసారథి బోస్

ఐఆర్ఈఎఫ్ కళాశాల బస్సు దగ్ధం

● బస్సులో 30 మంది విద్యార్థులు
● డ్రైవర్ అప్రమత్తతతో క్షేమం
● ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

రేపల్లె-చెరుకుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): షార్టుసర్క్యూట్ కారణంగా ఐఆర్ఈఎఫ్ కళాశాలకు చెందిన నర్సింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సు చెరుకుపల్లిమండలం గూడవల్లి వద్ద దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తమై బస్సులో ఉన్న 30 మంది విద్యార్థులను సురక్షితంగా బయటకు దింపారు. దీంతో పెనుప్రమాదం నుంచి బయటపడ్డామంటూ విద్యార్థినులు కన్నీటి పర్యంతమయ్యారు. రేపల్లె పట్టణంలోని 19వ వార్డులోని ఐఆర్ఈఎఫ్ (ఇండియన్ రూరల్ ఇవాంజికల్ ఫెలోషిప్)కు చెందిన కళాశాల బస్సు శనివారం ఉదయం నర్సింగ్ విద్యార్థులకు రాత పరీక్షల నిమిత్తం గుంటూరుకు బస్సులో బయలుదేరారు. ఈ బస్సులో 30 మంది విద్యార్థినులు ఉన్నారు. గూడవల్లి సమీపంలోకి వచ్చేసరికి బస్సులో పొగలు కమ్మేయ్యటంతో డ్రైవర్ మేరుగశ్యామ్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపి విద్యార్థులను కిందకు దింపారు. బస్సులో ఒక్కసారిగా శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. స్థానికులు గోగినేని కృష్ణ, రావిపాటి సీతారామయ్య మరికొందరు స్థానికులతో కలసి బస్సులో మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఇంతలో రేపల్లె నుంచి ఫైర్ ఇంజన్ రావటంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న నర్సింగ్ విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. సమాచారం తెలిసిన విద్యార్థినుల తల్లిదండ్రులు గూడవల్లికి చేరుకుని తమ పిల్లలను చూసుకుని ఊపిరి పీల్చుకున్నారు. కండీషన్‌లోలేని బస్సులు తిప్పటం వలనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, కనీస మరమ్మతులు నిర్వహించకుండా 30 మందిని ఎక్కించుకుని గుంటూరు తరలించటం యాజమాన్యం నిర్లక్ష్య ధోరణియేనని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు. సాంకేతిక లోపాలు, షార్టుసర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని ఫైర్ ఆఫీసర్ సాంబశివరావు తెలిపారు. దీనిపై చెరుకుపల్లి ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


గూడవల్లివద్ద దగ్ధమవుతున్న కళాశాల బస్సు

అధికారుల గైర్హాజరుపై జడ్పీ ఆగ్రహం

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న సీఈవో
● 2024-2025 వార్షిక సవరణ బడ్జెట్‌కు ఆమోదం

గుంటూరు సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్య వ్యవహార శైలిపై శనివారం జిల్లా పరిషత్‌లో జరిగిన స్థాయి సంఘాల సమావేశంలో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. అధికారులు రానప్పుడు ఈ సమావేశాలు ఏర్పాటు చేయటం ఎందుకు అన్న భావన చైర్‌పర్సన్‌తోపాటు, జడ్పీ టీసీలలో కలిగింది. చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆదేశాలతో జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా పరిషత్ మీటింగ్‌లను ఉద్దేశ పూర్వకంగా బహిష్కరిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈలపై రాష్ట్ర ఈఎన్‌సీకి ఫిర్యాదు చేస్తామని సీఈవో వెల్లడించారు. చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆధ్వర్యంలో జరిగిన మొదటి స్థాయి సంఘ సమావేశంలో ప్రణాళిక, ఆర్థిక అంశాలపై చర్చ జరిగింది. 2024-2025 సంవత్సరానికిగానూ సవరణ బడ్జెట్‌లో రాబడి రూ. 64,02,07,000 గా ఉండగా, ఖర్చు రూ. 62,21,77,000 గా ఉండగా, మిగులు బడ్జెట్ రూ. 1,80,30,000 చూపించారు. ఈ సమావేశంలో జడ్పీ భూముల లీజు వ్యవహారంపై కొద్దిసేపు చర్చ జరిగింది.

వేలం పాటకు మమ్మల్ని పిలవరా...

అచ్చంపేట మండలం కొత్తపల్లి, తాళ్లచెరువులో జిల్లా పరిషత్‌కు చెందిన 3.78 సెంట్ల వ్యవసాయ భూమి లీజు వ్యవహారంలో అక్కడి జడ్పీ టీసీ తుమ్మా విజయప్రతాప్ రెడ్డి సమావేశంలో మాట్లాడారు. వేలం వేసేటప్పుడు సమాచారం అందించకపోవడం దారుణమన్నారు. దానిపై జడ్పీచైర్ పర్సన్, సీఈఓ జోక్యం చేసుకుని ఇక మీదట జడ్పీటీసీని వేలం పాటకు ఆహ్వానించేలా అధికారులను ఆదేశిస్తామన్నారు. పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు టోల్ ప్లాజా వద్ద నున్న జడ్పీ స్థలం విషయంలో అక్కడి జడ్పీ టీసీ జంగా కోటయ్య ప్రస్తావించారు. గుంటూరు డ్వామా పీడీ వి.శంకర్ మాట్లాడుతూ జిల్లాలో 15 గ్రామీణ మండలాల్లో 29 లక్షల పని దినాలు లక్ష్యం ఉన్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ఇళ్ల పన్నుల వివరాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ యాప్ అందుబాటులో కి తెచ్చిందని జిల్లా పంచాయతీ అధికారి సాయి తెలిపారు. జడ్పీటీసీలకు గౌరవ వేతనం పెంచే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సభ్యులు కోరారు. హెన్రీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో వివిధ స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి.


సమావేశంలో చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, సీఈవో జ్యోతి బసు

నాదెండ్ల రామారావుకు సీనియర్ సైంటిస్ట్ అవార్డు

తాడికొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావుకు సీనియర్ సైంటిస్ట్ అవార్డు లభించిందని కళాశాల ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం నాదెండ్ల రామారావుకు సీనియర్ సైంటిస్ట్ అవార్డుకు సంబంధించిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఫార్మా విద్యారంగంలో, పరిశోధనా రంగంలో ఉత్తమ ప్రతిభ చాటినందుకు అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఫార్మసీ(ఏబీఏపీ) వారు సీనియర్ సైంటిస్ట్ అవార్డును ప్రకటించిందని తెలిపారు. డిసెంబరు 19,20,21 తేదీల్లో ఉత్తరప్రదేశ్ మాంగల్యధాన్ యూనివర్సిటీలో నిర్వహించే 18వ వార్షిక వేడుకల్లో అవార్డును అందజేస్తారని తెలిపారు. రామారావు ఫార్మసీ విద్య, పరిశోధనా రంగంలో 200కు పైగా పరిశోధన పత్రాలను ప్రచురించి, 7 పుస్తకాలను రచించి, 3 పేటెంట్లను సొంత చేసుకున్నారని తెలిపారు. రామారావును కళాశాల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, అభినందించారు.


ఉత్తమ సైంటిస్ట్ ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఆంజనేయులు, సుజిత్‌కుమార్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00





గురజాడ, సిరివెన్నెలకు ఘననివాళి

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమాజ అభ్యుదయం కోసం కృషి చేసిన త్యాగమూర్తులలో గురజాడ అప్పారావు ప్రముఖులని, ఎన్నో గొప్ప సినీగీతాలు రచించి ప్రేక్షకుల మన్నలను పొందిన గొప్ప రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి, సిరివెన్నెల సీతారామశాస్త్రి వర్ధంతి సభలలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, ప్రముఖ సాహితీవేత్త అబ్దుల్ ఖాదర్ జిలాని మాట్లాడారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు గురజాడ అప్పారావు, సిరివెన్నెల శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారన్నారు.

పేదలందరికీ నివేశన స్థలాలివ్వాలి

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలందరికి నివేశన స్థలాలిచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు చొప్పున మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె బి.శ్రీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో నిరుపేద కుటుంబాలకు చెందిన గిరిజనుల నుంచి నివేశన స్థలాల దరఖాస్తులు పూర్తి చేయించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు అర్హత గల ప్రతి ఒకరి నుంచి దరఖాస్తు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, మహిళా సమైక్య జిల్లా కన్వీనర్ రత్నకుమారి, సీపీఐ నాయకులు ఆట్ల పోలిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలి

రేపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు ఉన్నప్పటికి గత ప్రభుత్వంపై సాకుచెబుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో గత నెలలో 7వేల కోట్లపైన భారం వేయటం ఎంతవరకు సమంజసమని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. శనివారం బస్టాండ్ సెంటర్‌లో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బారాల సర్క్యులర్‌ను దగ్ధంచేసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌చార్జీల భారం తగ్గించకపోతే రాష్ట్రంలో మరో విద్యుత్‌పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశీర్వాదం, రమేష్, కె.ధర్మరాజ్, ఆగస్టీన్, ప్రజాసంఘాలు పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజంలో విప్లవాత్మక మార్పులు

● డాక్టర్ సుంకర గోపాల్



మాట్లాడుతున్న డాక్టర్ సుంకర గోపాల్

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తన సాహిత్యంతో సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మహాకవిగా గురజాడ అప్పారావు చరిత్రలో నిలిచిపోయారని తెలుగు ప్రొఫెసర్, సాహితీవేత్త డాక్టర్ సుంకర గోపాల్ అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లిలో వివేకా సర్వీస్ సొసైటీ, ధృతి సాహిత్య, సాంస్కృతిక సామాజిక సంస్థ ఆధ్వర్యంలో నెలనెల నందివర్ధనం 94వ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని గురజాడ దగ్గర నుంచి శ్రీశ్రీ వరకు అనే అంశంపై ప్రసంగించారు. సమాజంలో గత శతాబ్దకాలంగా పరిడవిల్లిన వచనకవిత్వం అంతటికి ఆధారభూతమైన భావజలాన్ని గురజాడ అందించారనటం అతిశయోక్తికాదన్నారు. తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం గురజాడ, శ్రీశ్రీ మహాకవులుగానే కీర్తించబడతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివేకా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఎన్‌వివి.నాగరాజు, కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం, సమన్వయకర్త శీలం శ్రీనివాసరావు, బాపట్ల,చీరాల, పొన్నూరు, గుంటూరు తదితర ప్రాంతాలు నుంచి వచ్చిన సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో శనివారం ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని శంకర్ ఐ హాస్పటల్ పెదకాకాని గుంటూరు వైద్యసిబ్బందితో నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టి.ప్రసూనా రాణి మాట్లాడుతూ వ్యవసాయ కళాశాలలో ఉచిత కంటి పరీక్ష శిబిరంను ఏర్పాటు చేసిన కళాశాల పూర్వ విద్యార్థులు తమ విద్యనభ్యసించిన కళాశాల పట్ల గౌరవాభిమానులు కలిగియుండటమే కాక ప్రస్తుత విద్యార్థుల పట్ల బాధ్యత వహించి సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. 1974వ బ్యాచ్ వ్యవసాయ విద్యార్థుల సౌజన్యంతో ఈశిభిరం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

రేపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం ఉప్పూడిరోడ్డులోని వీరవల్లి ఫంక్షన్‌హాలులో రోటరీక్లబ్, శంకర్‌కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని పేదలకు రోటరీక్లబ్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గొట్టుముక్కల పాపారావు, సాయేశ్వరరావు, కుడితిపూడి నరసింహారావు, మల్లెల రామచంద్రరావు, యార్లగడ్డ బుచ్చియ్య పాల్గొన్నారు.

తుఫాన్‌తో అన్నదాతల్లో ఆందోళన

నగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా నగరం మండలంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శనివారం తేలికపాటి వర్షాలతో వ్యవసాయ పనులు ఆగిపోయాయి. దీంతో హార్వెస్టులతో వరికోతలు మొదలు పెట్టిన రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు.

పేదల సంక్షేమం చంద్రబాబు ఆకాంక్ష

● ఎమ్మెల్యే ఆనందబాబు



పెదపూడిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి)30 : పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు ఆకాంక్ష అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని పెదపూడిలో పెన్షన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు ఇంటింటికి వెళ్లి పేదలకు 4 వేల రూపాయలు పెన్షన్‌లు పంపిణీ చేశారు. ఆనందబాబు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. గత 5 సంవత్సరాల కాలంలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని, కేవలం గుంతలు పూడ్చడానికే రూ.1400 కోట్లు ఖర్చు అవుతుందంటే రోడ్లు ఏస్థాయిలో ఉన్నాయో ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో గొట్టిపాటి భాను గంగాధర్, దొడ్డపనేని సుధీర్, సుబాని, ఎంపీడీవో శేషమాంబ తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వ మూర్ఖత్వ పాలన, అనుభవ రాహిత్యంతో రాష్ట్రం కోలుకోలేని విధంగా దెబ్బతిన్నదని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శనివారం చుండూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. దేశంలోని అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ పేదల ఉన్నతికి రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి, భవిష్యత్ తరాల ఆర్థిక ఎదుగుదలకు చంద్రబాబు నిరంతరం కష్టపడుతున్నారు. రాజధాని, పోలవరం పునఃనిర్మాణానికి వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. విధ్వంసం అయిన రోడ్లు స్థానంలో కనీస మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం రూ.1400 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మా శివారెడ్డి, ఎల్లారెడ్డి, బాలకోటిరెడ్డి, వివిఎస్‌కె ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు శ్రీరామమూర్తి, కుర్రి వెంకటరెడ్డి, భీమవరపు శ్రీమాన్, రాఘవరెడ్డి, ఆళ్ల సుబ్బారెడ్డి, రాయపాటి శ్రీనివాసరావు, దేవిరెడ్డి నాగేశ్వరరావు, కేశం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సామాజిక భరోసా పింఛన్ పంపిణీ 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో కె.నరసింహారావు శనివారం తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో డిసెంబరు పింఛన్‌ను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన ఐదు శాతం ఆది, సోమవారల్లో పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. భట్టిప్రోలు మండలంలో 80 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఎస్‌వి రమణ తెలిపారు.

● నగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరం మండలంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఎన్టీఆర్ భరోసా పించన్‌ను పంపిణీ చేశామని మండల స్పెషలాఫీసర్ సైదానాయక్, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం అర్హులకు మండల పరిధిలో 94శాతం పించన్‌లను అందజేశామని సచివాలయ సిబ్బంది పెన్షన్‌ల పంపిణీకి చురుగ్గా పాల్గొన్నారని ఆయన అభినందించారు. దీంతో పాటుగా తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని 20 పంచాయతీలలో 7,871 మంది పెన్షన్‌దారులకు 3 కోట్ల 30 లక్షల 99 వేల రూపాయల నగదును అందజేస్తున్నామని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలలో శనివారం ఉదయం 5.30 నుంచి 298 మంది సిబ్బంది పెన్షన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారని వివరించారు. మండలంలోని నల్లమోతువారిపాలెం, కొత్తనందాయపాలెం, పాతనందాయపాలెం, ఏట్రవారిపాలెం, బుద్దాం, యాజలి, దమ్మనవారిపాలెం గ్రామాలలో జరుగుతున్న పెన్షన్ పంపిణిలో ఆయన పాల్గొని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్ అందజేశారు. మండలంలోని ఏట్రవారిపాలెంలో సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు పెన్షన్‌ను అందజేశారు. చింతాయపాలెం సర్పంచ్ పీటా శ్రీనివాసరావు, కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి పలు గ్రామాలలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పెన్షన్ల పంపిణిలో పాల్గొని పెన్షన్‌దారులకు నగదు అందజేశారు.

తోటివారికి సహాయపడాలనే సద్గుణాన్ని పెంపొందించుకోవాలి



గౌడ వనసమారాధనలో శివప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘీయులు

రేపల్లె, నవంబరు30(ఆంధ్రజ్యోతి) : సంఘీయులు తోటివారికి సహాయపడాలనే సద్గుణాన్ని పెంపొందించుకోవాలని అనగానిశివప్రసాద్ అన్నారు. శనివారం ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణమండపంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనను నిర్వహించారు. సత్యన్నారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు.ఈపూజా కార్యక్రమాల్లో శివప్రసాద్ పూజలు నిర్వహించారు. అనంతరం శివప్రసాద్‌ను వెండికిరీటంతో సన్మానించారు. ఈకార్యక్రమంలో గౌడసంఘీయుల నాయకులు తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, కేసన గోపాలరావు, గుర్రం మురహరిరావు, చెన్ను నాగమల్లేశ్వరరావు, గుర్రం విజయలక్ష్మీ, దాసరి అమర్‌నాథ్,కేసన నరసింహ,సాంబశివరావు పాల్గొన్నారు.

● సంఘీయులంతా ఐకమత్యంతో ఉండి సాటిపేదవారిని ఆదుకునే విధంగా ముందుకు వెళ్లాలని జనసేన పార్టీ నాయకుడు కమతం సాంబశివరావు అన్నారు. శనివారం రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద పాతరేపల్లె తాలూకా కాపు కార్తీకవనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించే విధంగా ప్రభుత్వాన్ని కోరాలని సూచించారు. అనంతరం 15వేల మందికి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, గాదె వెంకటేశ్వరరావు, చందు సాంబశివరావు, అమ్మిశెట్టి వాసు, మొవ్వ వృషాద్రిపతి, మల్లెల రామచంద్రరావు, వేషూరు శ్రీనివాసరావు, దామెర్లరాజారావు, మహేష్, శంకర్ పాల్గొన్నారు.

● బాపట్లనవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో కార్తీక వనసమారాధన కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గోపూజ మహాకలశస్థాపన, మహామండపారాధన అనంతరం శ్రీ సిద్దిబుద్ధి సమేత సంపత్ గణపతి హోమం నిర్వహించారు. మహన్యపూర్వక రుద్రాభిషేకం అనంతరం సాంప్రదాయ వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఎస్‌పి విఠలేశ్వర్ దంపతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాబునాగేంద్ర, మామిడి రాజశేఖర్, మామిడి రమేష్, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అరవపల్లిలో కాపు వనసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కాపుముఖ్యనేతలు

ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ ఎయిడ్స్ డే -2024 పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రకారం బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ నుంచి ఓల్డ్‌బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీ హెచ్‌ఐవి ఎయిడ్స్‌తో మరణించిన వారికి నివాళిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, జిల్లాలోని టి.ఐఎన్ జిపిఎస్ అవుట్ రీచ్ వర్కర్స్ పాల్గొన్నారు.

● రేపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శనివారం ఎయిడ్స్‌డే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత ఎయిడ్స్‌పట్ల అప్రమత్తంగా ఉండాలని క్షణికావేశానికి గురికావొద్దన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి బి.రూపశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ గోపాలరావు, న్యాయవాది డి.హరికుమార్, డాక్టర్‌లు జీవన్, చైతన్య, పృధ్వీగణేష్, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌రిబ్బన్‌క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్‌డే వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పీసీ రవిచంద్రకుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్‌కి మందులేదని నివారణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.కోటేశ్వరరావు, డాక్టర్ ఎం.దాసు, కె.బాలగురవయ్య, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలెంటీర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



పూజలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు

పిట్టలవానిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంమండలం చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో జరిగే అమావాస్య హోమ కార్యక్రమానికి ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ మర్యాదాలతో పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడ జరిగే హోమ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు, ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తులు ఆలయ విశిష్టత గురించి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులకు వివరించారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు

బాపట్లలో పౌర సమాఖ్య సమావేశం

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పౌరసమాఖ్య బాపట్ల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి విధానం, సమస్యలు, పరిష్కారాలు అంశంపై ఈ సదస్సును ప్రొఫెసర్ కారుమంచి విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వేతర సంస్థ సెర్ప్ కార్యదర్శి సీహెచ్ పార్థసారథి మాట్లాడుతూ భూగర్భజల వనరులు, వినియోగం, ఇంకుడు గుంతల అవసరం గురించి, నియంత్రణతో కూడిన సమగ్ర విధానాన్ని ప్రభుత్వం తీసుకురావాలని కోరారు.

అంతర్జాతీయ సాగు, మురుగునీటి కమిషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.యల్లారెడ్డి మాట్లాడుతూ నీరు లభ్యత, విలువ గురించి వృధా చేయకుండా ఎక్కువగా ఉపయోగపొందే పద్ధతులు గురించి వివరంగా తెలియజేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ జి.రవిబాబు మాట్లాడుతూ కృష్ణాడెల్టాలో ఉన్న వివిధ కాల్వలు, ఆయుకట్టు సమస్యలు గురించి ప్రతి మనిషికి ఆహారానికి ఎంత నీరు ఖర్చుఅవుతుందో వివరిస్తూ ప్రణాళిక బద్ధమైన వ్యవసాయం అవసరమని తెలిపారు.

కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కర్పూర హారతిని వెలిగిస్తున్న గుండ్రెడ్డిశివ అనురాధ దంపతులు

కర్లపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి గ్రామంలో ఉన్న మూడు దేవాలయాల ప్రాంగణంలో శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామివారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ, అనురాధ దంపతులు స్వామివారికి శనివారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం కర్పూరజ్యోతి వెలిగించి హారతులనిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను కర్పూర హారతిని వీక్షించారు.

శ్రీ కాళీకమ్మ ఆలయంలో కర్పూరహారతి, లక్షదీపోత్సవం

కర్లపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ కాళీకమ్మతల్లి, వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి 7 గంటలకు కార్తీకమాసం ముగింపు సందర్భంగా 11 కేజిల కర్పూరజ్యోతిని వెలిగించారు. శ్రీకాళీకమ్మఅమ్మవారి ఆలయ ప్రాంగణంలో లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. లక్ష దీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించి చూపరులకు కనువిందుచేశారు.

● కొల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పూర్తి కావస్తుండటంతో అనంత భోగేశ్వరస్వామికి భక్తులు విశేష పూజలు జరిపారు. శనివారం స్థానిక గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వర, మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు కొమ్మూరి శివప్రసాద్, అనంత్, శివశర్మలు నిర్వహించారు.


నగరంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

నగరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : నగరంలో శ్రీలక్ష్మీపద్మావతిసమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలు జరిగాయి. శనివారం సుమారు 80 మంది దంపతులు ఈపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ తూనుగుంట్ల జగదీష్, కమిటీ సభ్యులు మట్టా శ్రీనివాసరావు, సీతాపతి, శివసాంబయ్య, చింతల వెంకటశేషసాయి, ప్రసాద్, తాడివాక హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన దబ్బకూటి

నిజాంపట్నం,నవంబరు30(ఆంధ్రజ్యోతి) : నాగార్జున యూనివర్సిటీ, ఇండియన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా సంయుక్తంగా నవంబరు 2024లో నిర్వహించిన పొటోగ్రఫి పోటీల్లో నిజాంపట్నంకు చెందిన దబ్బకూటి శ్రీనివాసరావు ఉత్తమ పొటోగ్రాఫర్‌గా ఎన్నికై బంగారు పతకాన్ని సాధించుకున్నారు. నాగార్జున యూనివర్సిటీలో శనివారం 132 ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో నిజాంపట్నంకు చెందిన దబ్బకూటి శ్రీనివాసరావు ప్రతిభ కనబరిచినప్పటికి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎన్నికవ్వటంతో ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు చేతుల మీదగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.రంగారావు, కామర్స్ అండ్ లా ప్రిన్సిపాల్ ఎన్.సురేష్‌కుమార్, హెడ్ డిపార్టుమెంట్ ఆఫ్ జర్నలిజం డాక్టర్. జే.మధుబాబు, డిజిటల్ పొటో జర్నలిజం చైర్మన్ తమ్మా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే వేగేశన, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం



ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బాపట్ల 18వ వార్డు ప్రజలు

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపాలిటి 18వ వార్డులోని ప్రజలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చిత్రపటాలకు పాలాభిషేకాన్ని శనివారం నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర బీసీనాయకుడు చేజర్ల సతీష్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి దేవస్థానం వెనుకబజారులో సచివాలయ సిబ్బందితో కలిసి లబ్దిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. చేజర్ల సతీష్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఒకరోజుముందు 30వ తారీఖున పెన్షన్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోదుగుల సూరిబాబు, ధూళిపాళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.



హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

సీఎం చంద్రబాబు పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్లనవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ ప్రాంతాన్ని కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర్ కలిసి శనివారం పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి సీఎం హాజరయ్యే కార్యక్రమం వేదిక వరకు కాన్వాయ్ వెళ్ళే మార్గాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఉన్నత పాఠశాల వెనుక వైపు ఉన్న సమీకృత వసతి గృహాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మార్గంలో ఉన్న ఈ వసతి గృహాన్ని పరిశీలించే అవకాశం ఉందని అధికారులకు తెలిపారు. విద్యార్థినుల వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, మరుగుదొడ్లు, తదితరమైనవన్ని ఆయన పరిశీలించారు. వసతిగృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులు ఉండే ప్రతి గదిలో ఫ్యాన్‌లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ కొరకు ప్రాంగణాన్ని సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలో తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో పాఠశాలలోనే సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో ప్రస్తుతం 919మంది విద్యార్థులు ఉండగా వారందరి తల్లిదండ్రులకు ఆహ్వానం పంపాలన్నారు. అలాగే డిజిటల్ ఆహ్వానం ప్రత్యేకంగా తయారు చేసి వారి ఫోన్‌లకు పంపాలన్నారు. పూర్వవిద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులే యాంకరింగ్ చేపట్టేలా చైతన్యపర్చాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో మున్సిపాలిటి సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీసు కవాతు మైదానం నుంచి మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్, డీఈవో పురుషోత్తం, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామానికి చెందిన పాములపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్సకు ఖర్చు చేసిన డబ్బును రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇప్పించి ఆదుకోవాలని సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు దరఖాస్తు చేశారు. సంబంధించిన దరఖాస్తు ద్వారా ఆనందబాబు ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేశారు. దీంతో సుబ్రహ్మణ్యేశ్వరరావుకు రూ.2 లక్షల 7 వేల 490 ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేశారు. సంబంధిత చెక్కును ఆనందబాబు చేతుల మీదుగా శనివారం సుబ్రహ్మణ్యేశ్వరరావు కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

డ్వాక్రా సంఘాలకు మరింత లబ్ధిచేరేలా కూటమి ప్రభుత్వం చర్యలు


● ఎస్ఎంఎం ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఎంఎం ప్రభావతి

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాలకు మరింత లబ్ధి చేకూరేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు స్టేట్ మిషన్ మేనేజర్ ప్రభావతి అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని మెప్మా విభాగం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధులు, ప్రభుత్వ పథకాల ఎక్కువ లబ్ధి చేకూర్చాలనే సదుద్దేశ్యంతో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఎస్.హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌ను రూపొందించటం జరిగిందన్నారు. ఈ యాప్ ద్వారా డ్వాక్రా సంఘ సభ్యుల వాస్తవ వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేయించటం జరుగుతుందన్నారు. పట్టణ పరిధిలోని ఎస్.హెచ్‌జి సభ్యులందరు మీ యొక్క గ్రూపు వివరాలు, వ్యక్తిగత వివరాలను అర్పీలకు అందజేయాలని కోరారు. డ్వాక్రాగ్రూపులోని అందరు సభ్యులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయించుకొనని సంఘ సభ్యులు ఎవరైన ఉంటే వారందరు డిసెంబరు 5వ తేదీ లోపు మీ ఏరియా అర్పీల ద్వారా ఎస్.హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌లో ఆన్‌లైన్ చేయించుకొని ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందగలరని తెలిపారు.

2వ తేదీ వరకు రైతులు వరికోతలు కోయవద్దు : ఏవో



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో వెంకటేశ్వరరావు

కొల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాల వల్ల డిసెంబరు 2వ తేదీ వరకు రైతులు తమ పంటను కోయవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం మండల గ్రామాల్లో వరిపైర్లను, ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. వర్షాలు, ఈదురుగాలులకు నేలవాలిన, నీటమునిగిన పంటపై 2శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. గోతాల్లో ధాన్యం నింపిన రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్లి షెడ్యూల్ తీసుకుని అమ్మకాలు చేసుకోవచ్చని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో 203.4 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లోగా తమ ఖాతాల్లో నగదు జమ కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. రైతులు, దళారులకు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని సూచించారు.

బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం : ఎంపీడీవో

వేమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమని ఎంపీడీవో శివన్నారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో సీడీపీవో విజయలక్ష్మి అధ్యక్షతన బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, బాల్య వివాహాలు నివారించేందుకు ప్రతి మహిళా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. సీడీపీవో మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టపరంగా వ్యతిరేకం అన్న విషయాన్ని ప్రతి కుటుంబానికి తెలియజేయాలని అందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రధాన భూమిక వహించాలన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలోని అంగన్‌వాడీల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మాధవి, శాంతిశ్రీ, వెంకటరమణ తదితరులు ప్రసంగించారు.

ఏఎస్ఐ రామారావు సేవలు అభినందనీయం

బాపట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏఎస్ఐ దశరథ రామారావు సేవలు అభినందనీయమని అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ అన్నారు. చీరాల టుటౌన్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ చేసిన రామారావు దంపతులను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, రామారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




డేంజర్ మొబైల్స్

● కాలక్షేపంతో కాలహరణ

● షార్ట్స్, రీల్స్‌కు బానిసలు అవుతున్న యువత ● మెదడుపై తీవ్ర ప్రభావం తప్పదంటున్న నిపుణులు ● పిల్లల్లో పెరుగుతున్న మానసిక, శారీరక వ్యాధులు ● అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

గుంటూరు (తూర్పు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో అందించే వినోదం పట్ల ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారు. ఇదేమి కొత్త విషయం కాదు. రోజుల పాటు జరిగే నాటకాల నుంచి, మూడు గంటలపాటు ఉండే సినిమా పట్ల ఆసక్తిని చూపడం వంటివి పూర్వకాలం నుంచే ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్ వచ్చిన తరువాత పరిస్థితులు మారిపోయాయి. తొలిరోజుల్లో యూట్యూబ్‌లో వచ్చే 10 నిమిషాలలోపు నిడివి వీడియోలు ఎక్కువ మంది చూసేవారు. వినోదాల నిడివి గంటల నుంచి నిమిషాలకు కుదించారు. ఈ మధ్యకాలంలో ఈ నిడివి సెకన్లుకు తగ్గి షార్ట్స్, రీల్స్ రూపంలో వినోదాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వీటి హవా నడుస్తుంది. సినిమాల ప్రచారం, ముఖ్యమైన వార్తలు సైతం 60 సెకన్లుకు కుదించి షార్ట్స్ రూపంలో తీసుకువస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్, కొన్ని రకాల యాప్‌లు షార్ట్ వీడియోలను ప్రోత్సహిస్తున్నాయి.





వస్తువులకు బందీలు అయ్యేవారు కూడా బానిసలే అని గ్రీకు తత్వవేత్త డయాజినస్ అన్న మాటలు స్మార్ట్‌ఫోన్‌ను అతిగా వినియోగించేవారికి సరిగ్గా సరిపోతాయి. చేతిలోకి వచ్చిన అద్భుతాన్ని సద్వినియోగం చేసుకోకుండా అనవసర విషయాలపై ఆసక్తిని చూపుతూ విలువైన కాలాన్ని వృథా చేయడంతోపాటు మానసిక వ్యాధుల బారిన పడుతున్నారు. కొంతమంది వీడియోలు చూస్తూ రోజువారి పనులు కూడా మర్చిపోతున్నారు. ప్రయాణాల సమయంలో, పనివేళల్లో, చివరికి తినే సమయంలో, బాత్‌రూంకి వెళ్లేటప్పుడు కూడా ఫోను ఉండాల్సిందే. ఇలా రోజులో మూడొంతులు స్మార్ట్ ఫోన్‌తోనే గడుపుతున్నారు. కొంతమంది ఇంకాస్త ముందుకెళ్లి స్వయంగా వీడియోలు తీసి అప్‌లోడ్ చేస్తుంటారు. ఏదో పని చేశామనే భావనతో, ఎలాంటి పని చేయకుండా చిన్నపాటి శ్రమతో నిద్రకు ఉపక్రమించే పరిస్థితులు స్మార్ట్‌ఫోన్ వచ్చాక ఎక్కువగా కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

30 రకాల వీడియోలు

షార్ట్స్, రీల్సులో వచ్చే వీడియోలు దాదాపుగా 30 రకాలుగా ఉంటున్నాయని యూట్యూబ్ గుర్తించింది. ముఖ్యంగా డబ్‌స్మాష్, పాటలకు నృత్యాలు చేయడం, చిన్నపాటి జోక్‌లు, పెద్ద వీడియోలకు ప్రోమో చిత్రాలు, ఇతరులు చేసే వీడియోలకు గొంతును అందించడం, ఒకేవిధంగా భిన్నమైన చోట్ల జరిగే సంఘటనలను ఒక చోటకు చేర్చడం, చారిత్రక విషయాలను వివరించడం ఎక్కువగా ఉంటున్నాయి. షార్ట్స్, రీల్సు చేసే వారిలో ఎక్కువ శాతం కుటుంబ సభ్యులే ఉంటున్నారు. వీడియోలు చేసే వారి కంటే షార్ట్స్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. భారతదేశంలో స్మార్ట్‌ఫోను ఉన్న ప్రతి 10 కుటుంబాల్లో నలుగురు షార్ట్స్ చేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

దృష్టి మళ్లించాలి..



స్మార్ట్‌ఫోన్ బారినపడి యువత సమన్వయం కోల్పోతున్నారు. ఫోన్‌ను ఎక్కువ సమయం చూడటం వలన చిరాకు, అసహనం ఏర్పడుతుంది. 15 ఏళ్ల వయసు కలిగిన వారు పోర్న్ వీడియోలు చూడటానికి ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది దీనికి బానిసలు అవుతున్నారు. కౌన్సెలింగ్ కోసం టీనేజర్లు జీజీహెచ్‌కి తరచూ వస్తున్నారు. పిల్లలు, టీనేజర్ల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఖాళీ సమయంలో పిల్లలను బయటకు తీసుకెళ్లాలి. స్మార్ట్‌ఫోన్ నుంచి దృష్టి మళ్లించాలి.

- ఎన్.ఉమాజ్యోతి,ప్రొఫెసర్, మానసిక వ్యాధుల నిపుణులు, జీజీహెచ్





రీల్స్‌కు బానిసలు అవుతున్న యువత

యూట్యూబ్‌లో వచ్చే సాధారణ వీడియోలకంటే రీల్సు, షార్ట్స్‌ను ఎక్కువ మంది చూస్తున్నారు. తక్కువ నిడివి, ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వీడియోలు ఉండటం, మధ్యలో ఎటువంటి వాణిజ్య ప్రకటనలు లేకపోవడం వంటి కారణాలతో వీటిపై ఆసక్తి పెరిగింది. సగటున ప్రపంచంలో ప్రతి వ్యక్తి రోజుకు 400 నిమిషాల పాటు షార్ట్స్ చూస్తే ఇన్ని వీక్షణలు సాధ్యమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, యువత వీటికి బానిసలు అవుతున్నారు. టాయిలెట్‌కు వెళ్లినా, భోజనం చేసే సమయంలోనూ, మంచంమీద పడుకున్నా ఫోన్ చూస్తూనే ఉంటున్నారు. దీనినే 'నోమోఫోబియా' అంటారు. అతిగా మొబైల్ వాడకంతో పరధ్యానం వస్తుంది. చేస్తున్న పనిపై ఏకాగ్రత ఉండదు. రీల్స్‌లో పడి మానవుల సగటు ఏకాగ్రత 2.5 నిమిషాల నుంచి 47 సెకన్లుకు తగ్గిందని నిపుణులు చెబుతున్నారు.

భ్రమల్లో గడిపేస్తున్నారు



అత్యాధునిక సాంకేతికత కలిగిన ఫోన్లు అందుబాటు లోకి రావడంతో వీటితో గడిపే సమయం కూడా పెరిగింది. అదే పనిగా ఫోన్ చూడటం వలన అద్భుతాలు సృష్టించడం తేలికనే భ్రమల్లో ఉంటున్నారు. తక్కువ నిడివి ఉన్న వీడియోలు మనిషిని ప్రభావితం చేస్తాయి. ఈ వీడియోలు పూర్తిగా గుర్తుంటాయి. దీంతో ఇవి మెదడుపై ప్రభావం చూ పుతాయి. వీడియోలు చేసేవారు కూడా సమాజంలో తాము ప్రత్యేకమైన వ్యక్తులుగా భావిస్తుంటారు. దీనివల్ల ఇతరులతో ఉండే సంబంధ బాంధవ్యాలకు దూరమవుతారు. ప్రత్యేకమైన వ్యక్తులుగా గుర్తింపు పొందటం అంత తేలిక కాదు.

-ఐవీఎల్ నరసింహారావు, సైక్రియాటిస్ట్, గుంటూరు

ఎన్నో ప్రభావాలు

● స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అదేస్థాయిలో మోసాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలు జరుగుతున్నాయి. పిల్లలు తెలియక చేసిన తప్పుకి ఖాతాలో రూ.7 లక్షలు మోసపోయామని నగరానికి చెందిన క్యాటరింగ్ నిర్వాహకుడు ఈ మధ్యనే పోలీసులను ఆశ్రయించాడు.

● ఫోన్‌ను ఆదేపనిగా చూస్తూ ఉండటం వల్లన చూపు తగ్గే ప్రమాదం ఉంది. అర్ధరాత్రి మొబైల్ నుంచి వెలువడే కాంతి కారణంగా శరీరానికి నిద్రకు అవసరమయ్యే హార్మోన్లు విడుదల కావు. దీంతో నిద్ర పట్టక పనితీరు మందగిస్తుంది. రోగ నిరోధకశక్తి తగ్గి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

● పిల్లలు ఫోన్ చూడటానికి స్కూల్, ఇతర కార్యక్రమాలను పక్కన బెడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. మెదడును ఉపయోగించుకుండా ఫోన్‌లపై ఆధారపడినట్లయితే మెదడు బలహీనంగా మారి పరిమాణంలో కూడా చిన్నదైపోతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో

అలర్జీలు దూరం

మంగళగిరి సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకుంటే అలర్జీలకు అడ్డుకట్ట వేయవచ్చని వైద్య నిపుణులు తెలిపారు. చినకాకాని ఎన్నారై వైద్య కళాశాలలో శనివారం ప్రారంభమైన జాతీయ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన పిల్లల వైద్యులు అలర్జీలపై ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల కారణంగా అనేక రుగ్మతలు పెరుగుతున్నాయని, వాటిలో అలర్జీల సంఖ్య అధికంగా ఉందని చెప్పారు. చిన్నపిల్లల్లో అలర్జీల సమస్య తీవ్రంగా ఉందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, రకరకాల కాలుష్యాలు మనిషి శరీర, ఆరోగ్య పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మి, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రెటరి డాక్టర్ సుబ్రహ్మణ్య శాస్త్రి, డాక్టర్ శనక్కాయల రాధామాధవి, సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, పిల్లల అలర్జీ జాతీయ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్, కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్వేకర్, డాక్టర్ కే.మురళీధర్‌రెడ్డి, డాక్టర్ పి.అనిల్‌కుమార్, డాక్టర్ వి.రఘురామరెడ్డి, డాక్టర్ వై.సంధ్య తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

ప్రపంచ స్థాయిలో ముగ్గుల పోటీలు

ఏపీఅమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ప్రథమ బహుమతి రూ.25 లక్షలుగా ప్రకటన

వినుకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వహకులు శనివారం తెలిపారు. ముగ్గుల పోటీ గోడప్రతులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వినుకొండలో శనివారం ఆవిష్కరించారు. ఫొటో, వీడియో రూపంలో ముగ్గులు పంపించి పోటీల్లో పాల్గొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. డిసెంబరు 1 నుంచి జనవరి 15 వరకు ఎంట్రీలు పంపవచ్చన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25 లక్షలు, రెండో బహుమతి రూ.15 లక్షలు, మూడో బహుమతి రూ.10 లక్షలు, నాల్గో బహుమతి రూ.5లక్షలు, ఐదో బహుమతి 2 లక్షల రూపాయలు అందిస్తామన్నారు. 100 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. వివరాలకు ఏఏఏముగ్గులు(ఎట్‌దిరేట్ ఆఫ్)టిహెచ్‌ఈఏఏఏ.నెట్ కు ఈమెయిల్‌ను సందర్శించాలన్నారు.



ముగ్గుల పోటీల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

రక్తికట్టిన రాచగావు

◆ ప్రారంభమైన వీరారాధన ఉత్సవాలు ◆ వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వీరాచారవంతులు

కారంపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవఅయ్యవారును ఇంటి నుంచి వీరాచారవంతులు ఊరేగింపుగా వీర్ల దేవాలయానికి తీసుకొచ్చారు. పలు జిల్లాల నుంచి వీరాచారవంతులు తరలివచ్చారు. వారు తొలుత తమ ఆయుధాలను నాగులేటిలోని గంగధార మడుగులో స్నానమాచరింపజేసి నూతన వస్త్రాలను అలంకరింపజేసి వీరుల ఆలయంలో ఉంచారు. పూజల అనంతరం పీఠాధిపతి కోటగోడ ముఖద్వారంపై ఎర్రజెండా ఎగురవేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆనాడు మాచర్ల, గురజాల రాజులు యుద్ధానికి సిద్ధం కమ్మని యుద్ధభూమిలో ఎర్రజెండా ఎగురవేసిన సూచికంగా పీఠాధిపతి ఎర్రజెండా ఎగురవేశారు. అనంతరం రాచగావు మంటపంలో పీఠాధిపతిని కంకణదారిని చేశారు. మేకపోతును గావు పట్టినట్టు నాటకీయంగా నిర్వహించారు. వీరవిద్యావంతులు మంటపంలో రాచగావు కథను గానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు, గ్రామ పెద్దలు, వీరాచారవంతులు పాల్గొ న్నారు.



గంగధార మడుగులో ఆయుధాలకు స్నానమాచరింపజేస్తున్న వీరాచారవంతులు

ఎడ్ల పోటీలతో రైతుల్లో ఉత్సాహం

ఎడ్ల పోటీలతో రైతుల్లో ఉత్సాహం నెలకొంటుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. వీరుల ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద తెలుగు రాష్ట్రాలస్థాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. మొదటి రోజైన శనివారం ఆరుపళ్ల విభాగపు పోటీలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడ్ల పోటీలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. ఆరుపళ్ల విభాగంలో ఏడు జతలు పాల్గొనగా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి, కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండ కృష్ణకిషోర్‌రెడ్డి ఎడ్లజత ప్రథమస్థానంలో నిలిచింది. ప్రత్తిపాడు మండలం పెద గొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత రెండోస్థానం, పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత మూడోస్థానం, గురజాలకు చెందిన లింగా అంజయ్య చౌదరి, ధరణి ఎడ్లజత నాలుగోస్థానం, నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లజత ఐదోస్థానం, గుంటూరుకు చెందిన పిడపర్తి శ్రీనివాసరెడ్డి, నూజెండ్ల మండలం రెడ్డిపాలేనికి చెందిన జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్లజత ఆరోస్థానంలో నిలిచాయి.



విజేత ఎడ్లజతతో మాజీ మంత్రి ఆలపాటి, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, అంజయ్య

ఉత్తరాఖండ్‌పై ఆంధ్రా ఘనవిజయం

మంగళగిరి స్టేడియంలో కొనసాగుతున్న క్రికెట్



అరవ్ (103 పరుగులు)



రాజేష్ (6 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌పై ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 137 పరుగులతో మూడో రోజు బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 70.1 ఓవర్లలో 255 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. దీంతో ఆంధ్రా జట్టు 136 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్ అరవ్ మహాజన్ 103 పరుగులతో రాణించాడు. ఆంధ్రా బౌలర్లు ఎన్.రాజేష్ 6 వికెట్లు, ఏఎన్‌వీ లోహిత్ 4 వికెట్లు పడగొట్టారు. ఆంధ్రా జట్టుకు 6 పాయింట్లు లభించాయి.

బాల్‌బ్యాడ్మింటన్‌లో గుంటూరు ప్రథమం

తూర్పుగోదావరిలో ముగిసిన అంతర జిల్లాల బాలికల పోటీలు

బిక్కవోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో గుంటూరు జట్టు నిలిచింది. ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు శ్రీకాకుళం, విశాఖ, ప్రకాశం జట్లు సాధించాయి. విజేత జట్లకు జిల్లా విద్యా శాఖాధికారి పి.వాసుదేవరావు ట్రోఫీలు అందజేశారు.

హోరాహోరీగా పోటీలు..

ఫైనల్స్‌లో గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంటూరు 35-27, 35-27 స్కోరుతో శ్రీకాకుళంపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం పొందింది. అలాగే విశాఖ.. ప్రకాశం జట్టుపై 35-30, 35-31 స్కోరుతో గెలుపొంది ద్వితీయ స్థానం పొందగా ప్రకాశం జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.



ప్రథమ స్థానం సాధించి డీఈఓ నుంచి ట్రోఫీ అందుకుంటున్న గుంటూరు బాలికలు

రఘురామ కేసు దర్యాప్తులో కదలిక

- సీఐడీ కార్యాలయాన్ని పరిశీలించిన దర్యాప్తు అధికారి, ప్రకాశం ఎస్పీ దామోదర్

గుంటూరు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురి చేసిన కేసు దర్యాప్తులో కదలిక మొదలైంది. నరసాపురం వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలో రఘురామకృష్ణరాజును 2021 మే 14న హైదరాబాద్ నుంచి అక్రమంగా నిర్బంధించి గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తీసుకువచ్చి కస్టడీలో చిత్రహింసలకు గురి చేశారు. ఈ ఘటనపై గత జూన్‌లో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ ప్రధాన నిందితునిగా ఉండగా నాటి ఇంటిలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు రెండో నిందితుడిగా ఉన్నారు. అదే విధంగా నాటి సీఎం జగన్మోహన్ రెడ్డి మూడో నిందితునిగా ఉండగా, నాటి సీఐడీ అదనపు ఎస్పీ రావెల విజయ్‌పాల్ నాలుగో నిందితునిగా, అదేవిధంగా నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి 5వ నిందితురాలుగా ఉన్నారు. ఆ కేసులో నాలుగో నిందితుడైన విజయ్‌పాల్‌ను మూడు రోజుల క్రితం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశించారు. దీంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. కాగా ఆయనను కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ను కోర్టు కొన్ని సాంకేతిక కారణాల నేపథ్యంలో తిరస్కరించింది. ఇదిలా ఉంటే ఈ కేసులో మొదటిసారిగా దర్యాప్తు అధికారిగా ఉన్న ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ శనివారం గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని ప్రతి గదిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా కస్టడీలో రఘురామరాజును చిత్రహింసలకు గురిచేసిన గదిని అక్కడ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేసులో నాలుగో నిందితుడైన విజయ్ పాల్ ఎట్టకేలకు అరెస్ట్ అయిన నేపథ్యంలో కేసు దర్యాప్తు వేగవంతమైంది. ఆయన కస్టడీ పిటీషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో సోమవారం మరోసారి ఎటువంటి లోపాలు లేకుండా కోర్టులో పిటీషన్ దాఖలు చేస్తామని పోలీసులు తెలిపారు. కస్టడీలో విజయ్‌పాల్ నోరు మెదుపుతారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయన చెప్పే అంశాల ఆధారంగా కేసు దర్యాప్తు ఉంటుందని భావిస్తున్నారు. కేసులో ఇరువురు ఐపీఎస్ అధికారులు, మాజీ సీఎం జగన్ నిందితులుగా ఉన్న నేపథ్యంలో కేసు దర్యాపును అత్యంత జాగ్రత్తగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వారి అరెస్టుపై చర్చ నడుస్తున్న సమయంలో ప్రకాశం ఎస్పీ దామోదర్ సీఐడీ కార్యాలయాన్ని సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉత్సాహంగా కేఎల్‌యూ స్నాతకోత్సవం

42 బంగారు, 37 రజిత పతకాలు, 166 పీహెచ్‌డీల ప్రదానం

ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్

తాడేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు.. తల్లిదండ్రుల ఆనందోత్సాహాల మధ్య తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పతకాలు ప్రదానం చేశారు. రామ్‌నాథ్ కోవింద్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. శారీరక దృఢత్వం అవసరమని, యోగా ప్రాణాయామం, వ్యాయామం లాంటి కసరత్తులు చేస్తూ యువత ఎప్పుడు ధృఢంగా ఉండాలని చెప్పారు. కేవలం డిగ్రీ ఉంటే సరిపోదని, డిగ్రీతోపాటు నైపుణ్యాలు నేటి యువతకు అవసరమన్నారు. కేఎల్‌యూ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి తమ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపడతున్నారని చెప్పారు. తమ విద్యార్థులు దేశ విదేశాల్లో రూ.57లక్షల జీతాలతో ఉద్యోగాలు సాధించి చరిత్ర సృష్టించారన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ సారధివర్మ మాట్లాడుతూ 42 బంగారు, 37 రజిత పతకాలు, 166 పీహెచ్‌డి, 604 పీజీ, 3936 యూజీ సర్టిఫికెట్లు ప్రదానం చేశామని తెలిపారు. విద్యార్థులు ఆయా విభాగాల్లో 170కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. డిగ్రీలు అందుకునే విద్యార్థులతో కోనేరు సత్యనారాయణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, కలెక్టర్ నాగలక్ష్మి, రిజిస్ట్రార్ సుబ్బారావు, కేఎల్‌ఈఎఫ్ కార్యదర్శి కోనేరు కాంచనలత, ఉపాధ్యక్షులు కోనేరు రాజాహరీన్, బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల, ప్రోవీసీలు, వివిధ విభాగాల అధిపతులు, డీన్లు పాల్గొన్నారు.



రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న కెఎల్ మేనేజిమెంట్ బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల

ప్రశాంత్‌సిన్హాకు బంగారు పతకం

వర్సిటీలో ఉత్సాహంగా పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పెదకాకాని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉత్సాహపూరిత వాతావరణంలో సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతున్నాయి. తొలిరోజు పోటీ ఫలితాలను నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. 55 కేజీల కేటగిరీలో మంగళూరు యూనివర్సిటీకి చెందిన ప్రశాంత్‌సిన్హా బంగారు పతకాన్ని కైవాసం చేసుకున్నారు. మొత్తం 220 కేజీల బరువులెత్తిన ఆయన మొదటి స్థానంలో నిలిచారు. తిరువల్లూరు యూనివర్సిటీకి చెందిన పి.బాలాజీ, అదే యూనివర్సిటీకి చెందిన కె.సంజయ్ వెండి, కాంస్య పతకాలను అందుకున్నారు. 61 కేజీల విభాగంలో తిరువల్లూరు యూనివర్సిటీకి చెందిన పి. ధనుష్‌కుమార్ 256 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని కైవాసం చేసుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడాకారుడు డి.మౌలాలి వెండి, మంగళూరు యూనివర్సిటీకి చెందిన సుబ్రహ్మణ్య కాంస్య పతకం గెలుపొందారు.

3వరకు రాయగడ ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకే

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలు నవంబరు 30 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు విజయనగరం వరకే ప్రయాణిస్తుందని రైల్వేవర్గాలు తెలిపాయి. అలానే రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు చేరుకొంటుందని పేర్కొన్నాయి. కాగా ఈ విషయాన్ని శనివారం సాయంత్రం వరకు రైల్వే అధికారులు ప్రయాణీకులకు తెలియజేయకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో పడిఉన్న గ్రానైట్ స్లాబులు

వృథాగా గ్రానైట్ రాళ్లు

- అక్రమ రవాణాలో పట్టుబడి పోలీస్ స్టేషన్ ముందు పడి ఉన్న పలకలు
- ఏళ్లుగా విచారణకు నోచుకోని కేసు

బల్లికురవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మార్గంలో తరలిస్తున్న గ్రానైట్ స్లాబులు, ముడిరాయిని మైనింగ్ విజిలెన్స్ అధికారులు పట్టుకొని ఏళ్ల గడుస్తున్నాయి. ఆ కేసు విచారణ ముందుకు కదలకపోవడంతో లక్షల విలువ చేసే రాళ్లు పోలీసు స్టేషన్ సమీపంలో వృథాగా పడిఉన్నాయి. బల్లికురవ పోలీసు స్టేషన్ వద్ద గత నాలుగేళ్ల నుంచి గ్రానైట్ స్లాబులు, ముడిరాళ్లు ఉన్నాయి.



రోడ్డు మార్జిన్‌లో పడవేసి ఉన్న గ్రానైట్ ముడిరాయి

అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ రాళ్లను గతంలో అధికారులు పట్టుకొని లారీలను వదిలి పెట్టి అందులో ఉన్న రాళ్లను స్టేషన్ వద్ద అన్‌లోడ్ చేశారు. ఈ రాళ్ల కేసు నేటికీ విచారణకు వచ్చిన దాఖలాలు లేవు. పోలీసు స్టేషన్ వద్ద ఖాళీ లేకపోవడంతో పట్టుబడిన రాళ్లను రైతుల స్థలాల్లో పడేశారు. ఏళ్ల నుంచి మా స్థలంలో ఉంచిన రాళ్లు తీసుకెళ్లకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. పోలీసు స్టేషన్ వద్దకు వచ్చే ప్రజలు కూడా ఈ రాళ్లు చూసి కొంతకాలానికి ఇవి పనికిరాకుండా పోతాయని అంటున్నారు. అధికారులు ఆ రాళ్లను వేలం ద్వారా అమ్మితే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని ప్రజలు కోరుతున్నారు.

5న మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు : మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు సాధారణ మండల సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

జనన పత్రానికి పాట్లు

- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు
- నెలలు గడుస్తున్నా అందని వైనం



వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయం

వెలిగండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆధార్ కార్డులో జనన తేదీని సరిచేయడానికి రెవెన్యూ శాఖ జారీ చేసే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధ్రువీకరణ పత్రం ఎలా పొందాలో అవగాహన లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ విద్యార్థులు తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.

ఆధార్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉంటే మార్పుకు నేందుకు పదో తరగతి పూర్తయిన విద్యార్థుల మార్కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చినా చెల్లదని, 18 ఏళ్ల లోపు పుట్టిన తేదీ మార్చుకోవాలంటే తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం కావాలని ఆధార్ కేంద్రంలో అధికారులు చెబుతు న్నారు. దీంతో తల్లిదండ్రులు పనులు మానుకుని ఆధార్ కేంద్రాలు, సచివాల యాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో 4255 మంది విద్యార్థులు ఉన్నారు. అం దులో 1100 మందికి పైగా ఆధార్‌లో ఉన్న వివరాలు సరిగా లేవు. దీంతో తహసీల్దార్ కార్యా లయం చుట్టూ విద్యార్థులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రె వెన్యూ సిబ్బందిని జనన ధ్రువీకరణ పత్రం గురించి అడిగితే పొంతన లేకుండా సమాధానం చెప్పడమే కా కుండా మాపై మండిపడుతున్నారని విద్యార్థులు, తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలా చేసుకోవాలి..

2012 ముందు జన్మించిన వారు తహసీల్దార్ వద్ద, 2012 తరువాత జన్మించిన వారు పంచాయతీ కార్యదర్శి వద్ద ముందుగా నాన్ అవైలబిటీ సర్టిఫికెట్ తీసుకోవాలి. అనంతరం సచివాలయాల్లో జనన ధ్రువీకరణ పత్రం కోసం నిర్దేశిత నగదు చెల్లించి అప్లై చేయాలి. గుర్తింపు పొందిన న్యాయవాదితో అఫిడవిట్ తీసుకోవాలి. రూ.50 చలాన చెల్లించాలి. సంబంధిత పత్రాలన్నీ వీఆర్‌వోకు అందజేయాలి. ఆయన పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారి అనుమతి పొందిన తరువాత స్థానిక సచివాల యానికి వెళ్లి జనన ధ్రువీకరణ పత్రం పొందవచ్చు.

ఇన్‌చార్జి డాక్టర్లే దిక్కు

- అవస్థలు పడుతున్న పశుపోషకులు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర, మారెళ్ల పశువైద్యశాలలకు ఇన్‌చార్జ్ డాక్టర్లే దిక్కయ్యారు. కొన్ని సంవత్సరాల నుంచి ఇన్‌చార్జ్‌లే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యసేవలు అందక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



తాళం వేసి ఉన్న ఈదర

పట్టించుకోవాల్సిన జిల్లా పశు వైద్యశాఖాధికారు లు ఆవైపు కూడా కన్నెత్తి కూడా చూడటం లేదు. మం డలంలోని ఈదర పశువైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్ పేరయ్య చీమకుర్తి పరిధిలోని పశు వైద్యశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దాదాపు ఐదు సంవత్సరాల నుంచి ఇన్ చార్జ్‌తోనే ఈదర పశువైద్యశాల నడుస్తుంది. ఈ పశువై ద్యశాల పరిధిలో పూరిమెట్ల, భీమవరం, బొప్పూడివారిపా లెం, కొమ్మవరం, అయోధ్యనగర్, పూరిమెట్ల గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పశువులు ఏదైనా వ్యాధిబా రిన పడితే ప్రైవేట్ పశు వైద్యులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

ఈదర పశువైద్యశాలకు ఇన్‌చార్జ్‌గా తూర్పు గంగవ రం పశువైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ రాంబాబు కొన సాగుతున్నారు. మారెళ్ల పశువైద్యాధికారి కాశిరెడ్డి సెలవులో ఉండటంతో ముండ్లమూరు పశు వైద్యాధికారిణి ఎం.విజయలక్ష్మి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఒకే వైద్య శాలలో ఎక్కువ గ్రామాలు ఉండటం తో పశువులకు సక్రమంగా వైద్యం అందించ లేకపోతున్నారు. ముండ్లమూరు మండలంలో 37 వేల పశువులు ఉన్నాయి. ఇతర జీవులు, కోళ్ళు కూడా దాదాపు పదివేలకు పైగానే ఉన్నాయి. మండలంలో ఎక్కు వగా డెయిరీలతోపాటు కోళ్ళ ఫారాలు ఉన్నాయి. పశువైద్యుల కొరతతో సకాలంలో సేవలు అందడం లేదు. ప్రస్తుతం ఇద్దరే ఉండటంతో భారంగా మారింది. ఇప్పటికైనా జిల్లా పశువైద్యశాఖ అధికారులు స్పందించి రెగ్యులర్ పశువైద్యాధికారులను నియమించి తమ ఇబ్బందులను తొలగించాలని పశుపోషకులు కోరు తున్నారు.

తీరం అల్లకల్లోలం



ఒడ్డుకు చేరిన బోటులు



సముద్రతీరంలో పరిస్థితులను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

- ఆర్డీవో, తహసీల్దార్ పర్యటన
- మత్స్యకారులకు ఆంక్షలు, అధికారులకు సూచనలు

వాడరేవు(చీరాలటౌన్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా ఏర్పడిన తుఫాన్ ప్రభావం వలన చీరాల నియోజకవర్గ పరిధిలోని వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం సముద్రతీరంలో అలల ఉధృతంగా ఎగిసి పడుతున్నాయి. ఈక్రమంలో కొంత మేరకు సముద్రం ముందుకు పెరిగింది. దీంతో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ సిబ్బందితో కలిసి తీరంలో పర్యటించారు. గంటకు సుమారు 90 మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులకు వేటకు వెళ్లరాదని సూచించారు. సురక్షిత ప్రదేశాలలో ఉండాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే వాయుగుండం కారణంగా మత్స్యకారులు ఇప్పటికే బోటులను ఒడ్డుకు చేర్చారు. వేట నిషేధించడంతో పూట గడిచేందుకు తిప్పలు తప్పడంలేదని మత్స్యకారులు వేదన చెందారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని అధికారులు చెప్పారు. అధికారులు పలువురు సిబ్బంది ఉన్నారు.

వాగొచ్చినా.. వరదొచ్చినా రాకపోకలకు ఇబ్బందే



రాజుగారిపాలెం వాగుపై ఉన్న లో చప్టా



డేగరమూడి వాగుపై ఉన్న చప్టా

- రెండు చోట్ల బ్రిడ్జిల నిర్మాణం అవసరం

మార్టూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు గ్రామాల పరిధిలో లో చప్టాలు (పైపులకల్వర్టు) ఉన్నాయి. వాటి స్థానంలో బ్రిడ్జిలు నిర్మించాల్సిన అవసరం, ఆవశ్యకత ఉంది. వాటిలో డేగరమూడి వద్ద ఉన్న లోచప్టా వద్ద వరద నీరు వచ్చినా, వాగు నీటి ప్రవాహం పెరిగినా మార్టూరు మండలం నుంచి డేగరమూడి మీదుగా యద్దనపూడి మండలం చింతపల్లిపాడు, యనమదల, యద్దనపూడి గ్రామాలకు వెళ్లే ప్రజల రాకపోకలు ఆగిపోతాయి. అదేవిధంగా రెండవ లోచప్టా రాజుగారిపాలెం గ్రామ పరిదిలో ఉంది. మార్టూరు నుంచి బొబ్బేపల్లి, ద్రోణాదుల గ్రామాలకు దగ్గరదారిగా రాజుగారిపాలెం మీదగా వెళతారు. అయితే రాజుగారిపాలెం వద్ద లోచప్టా వద్ద వాన నీరు పెరిగితే ఈ రోడ్డు ప్రజల రాకపోకలకు బంద్ అయినట్లే. వాస్తవానికి ఎగువన రాజుగారిపాలెం వాగు ఉంటే దిగువన డేగరమూడి వాగు ఉంది. ఈ వాగులపైనే రెండు లోచప్టాలు ఉన్నాయి. భారీగా వర్షం కురిసినా, లేదా ఏదైనా తుఫాన్‌ల సమయంలో వాగు నీరు పెరగడంతో రెండు లోచప్టాల వద్ద భారీగా నీరు ఉధృతంగా, వేగంగా ప్రవహిస్తుంది. గతేడాది రాజుగారిపాలెం చప్టాపై ద్విచక్రవాహనదారుడు పారుతున్న నీటిపై వెళుతూ, నీటి వేగాన్ని అంచనా వేయలేక ద్విచక్రవాహనాన్ని నీటిలోనే వదిలేసి ప్రాణాలు దక్కించుకున్నారు. భారీగా వర్షపునీరు చేరినపుడు ఈ లోచప్టాల వద్ద పోలీసుల బందోబస్తు మాత్రం ఏర్పాటు చేస్తుంటారు. గత పాతికేళ్ల నుంచి ఈ చప్టాల వద్ద ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

ఎమ్మెల్యే ఏలూరిపైనే ఆశలు పెట్టుకున్న ప్రజలు

రెండు లో చప్టాల స్థానంలో కొత్తగా బ్రిడ్జిల నిర్మాణంపై మండల ప్రజలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పైనే ఆశలు పెట్టుకున్నారు. ఆయన జొన్నతాళి, చిమ్మిరిబండ గ్రామాల మధ్య ఉన్న లోచప్టా స్థానంలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణం జరగడానికి 2017-18 కాలంలో కృషి చేశారు. అదేవిధంగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా ఏలూరి మూడోసారి విజయం సాధించడంతో రెండుచోట్ల కొత్త బ్రిడ్జిల మంజూరుకు ఆయన కృషి చేస్తారని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

తప్పిన ముప్పు

- జిల్లాపై తుఫాన్ ప్రభావం నామమాత్రం
- కొన్ని ప్రాంతాల్లో జల్లులు
- పెరిగిన చలి తీవ్రత

ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పింది. ఆ ప్రభావం చిరుజల్లులకే పరిమితమైంది. రెండు, మూడు రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతోపాటు ఈదురుగాలులు వీస్తుండంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగానే ఉండొచ్చన్న సంకేతాలు తొలుత వాతావరణ శాఖ నుంచి అందాయి. తమిళనాడు తీరంలో చెన్నైకి సమీపంలో తుఫాన్ కేంద్రీకృతమై ఉండటంతో ఆ ప్రభావం జిల్లాపై ఉంటుందని ప్రజానీకం కూడా భావించింది. వాతావరణ శాఖ కూడా శుక్రవారం నుంచి మూడురోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అయితే తుఫాన్ ప్రభావం జిల్లాపై అంతగా చూపలేదు. పొరుగున ఉన్న నెల్లూరుతోపాటు తిరుపతి, అన్నమయ్య జిల్లాలలో జోరు వానలు కురుస్తున్నా ఇక్కడ మాత్రం జల్లులకే పరిమితమైంది. అవి కూడా శుక్రవారం సాయంత్రం నుంచి తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని ఒంగోలు, కొత్తపట్నం, సింగరాయకొండ, జరుగుమల్లి, మద్దిపాడు, ఎస్.ఎన్.పాడు, ఎన్‌జీపాడు, కొండపి తదితర మండలాల్లోనే పడ్డాయి. తుఫాన్ ప్రభావంతో ఉష్ణోగ్రతలు తగ్గడంతోపాటు చలితీవ్రత పెరిగింది. మూడు రోజులుగా ఇలాంటి వాతావరణమే నెలకొంది. ఈ పరిస్థితి జిల్లా ప్రజానీకాన్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మరోవైపు వాతావరణంలో వచ్చిన మార్పులతో ఎప్పుడు వర్షం కురుస్తుందోనని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని పొగాకు, శనగ సాగు చేసే రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

పకడ్బందీగా పథకాల అమలు

- దిశ సమావేశంలో మంత్రి డోలా, ఎంపీ మాగుంట
- సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు



దిశ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట తదితరులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశంలో వారు పాల్గొన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించి తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను, తాగునీటి పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, సైడు కాలువల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాం : ఎంపీ మాగుంట

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి మంజూరు చేసిన నిధులను మండలాలు, గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని సూచించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ జిల్లాలో లఖ్‌పతి దీదీ పథకం విజయవంతంగా అమలవుతున్నదన్నారు. సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా సూర్యఘర్ పథకాన్ని జిల్లాలోని 5లక్షల ఇళ్లకు విస్తరించడంపై దృష్టి సారించాలన్నారు.

ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలు ఇవీ..

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ నగరానికి పశ్చిమం వైపు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని కోరారు. అమృత్ పథకం కింద చేపట్టిన పనులు పూర్తి చేస్తే ఒంగోలుకు ప్రతి రోజూ తాగునీరు ఇవ్వొచ్చన్నారు.

సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేర్నమిట్ట వద్ద ఉన్న చెరువును అమృత్ పథకంలో చేర్చాలని కోరారు. గుండ్లకమ్మ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు సంబంధించి రెండు మోటార్లు పని చేయడం లేదని, కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 656 జాతీయ రహదారిలో మగ్గంపల్లి వద్ద లైట్స్ పనిచేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సమావేశం దృష్టికి తెచ్చారు. తాగునీటి పథకాలకు సంబంధించి కొత్త పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం ఉందని తెలిపారు.

గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒంగోలు నగర మేయర్ సుజాత, డీఆర్వో చినఓబులేషు, జడ్పీ సీఈవో చిరంజీవి, సీపీవో వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులతోపాటు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి డీఈవో నుంచి ట్రోఫీ అందుకుంటున్న గుంటూరు బాలికలు

విద్యార్థులకు క్రీడలూ అవసరమే

- డీఈవో వాసుదేవరావు
- అంతర్ జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు
- గుంటూరు ప్రథమ, శ్రీకాకుళం ద్వితీయ స్థానాలు కైవసం

బిక్కవోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడలు ప్రతి విద్యార్థికీ అవసరమని జిల్లా విద్యా శాఖాధికారి పి.వాసుదేవరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల పోటీలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో డీఈవో మాట్లాడుతూ క్రీడలకు గతంలో 2శాతం కోటా వుండేదని దానిని కూటమి ప్రభుత్వం 3శాతానికి పెంచిందని, క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. తల్లిదండ్రులందరూ చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు సాధించిన గుంటూరు, శ్రీకాకుళం, విశాఖ, ప్రకాశం జట్ల బాలికలకు ఆయన ట్రోఫీలు అందజేశారు. క్రీడలు దిగ్విజయంగా నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ. స్వామిని, పీడీ అసోషియేషన్ సభ్యులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల అబ్జర్వర్ సీహెచ్ రజినీదేవి, హెచ్ఎం పి.వీరప్రభాకరరావు, పీడీ, పీఈటీ అసోషియేషన్ అధ్యక్షులు ప్రసాద్, గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి అప్పారెడ్డి, అనపర్తి జోన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి టీవీ. రాఘవరెడ్డి, పీడీలు వై.బంగార్రాజు, మానుకొండ ధనరాజు, నందిపాటి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, వీకేఆర్.తంబి, ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో కె.హర్షచంద్రరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

ఫైనల్స్‌లో గుంటూరు - శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంటూరు 35-27, 35-27 స్కోరుతో శ్రీకాకుళంపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం పొందింది.. అలాగే విశాఖ.. ప్రకాశం జట్టుపై 35-30, 35-31 స్కోరుతో గెలుపొంది ద్వితీయ స్థానం పొందగా ప్రకాశం జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది..

వైపాలెం టీడీపీలో అదేతంతు

- మంగళగిరి వెళ్లిన మరో బృందం
- సీరియస్ అయిన రాష్ట్ర నాయకత్వం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో పాత కథ పునరావృతమవుతోంది. అందుకు ఇటీవల అటు రాష్ట్ర, ఇటు జిల్లా నేతల వద్ద నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు ఫిర్యాదులు చేసుకోవడం దర్పణం పడుతోంది. పక్షం క్రితం ఎర్రగొండపాలెం మండలానికి చెందిన కొందరు టీడీపీ శ్రేణులు రాష్ట్ర నాయకుల వద్దకు వెళ్లి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుపై ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే నియోజకవర్గానికి చెందిన ముఖ్యనాయకులంతా ఎరిక్షన్‌బాబుకు మద్దతుగా ఆపార్టీ పార్లమెంట్ అధ్యక్షుడిని కలిసి మంగళగిరి వెళ్లిన శ్రేణులపై ఆరోపణలు చేశారు. తిరిగి శనివారం దోర్నాల మండలం నుంచి మరో బృందం ఎరిక్షన్‌బాబుకు వ్యతిరేకంగా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లింది. ఎర్రగొండపాలెం నియోజకవర్గం 2009లో పునఃప్రారంభమైంది. అప్పటి నుంచి దళితులకు కేటాయించారు. స్థానికంగా దీటైన నాయకుడు లేకపోవడంతో బయటి నేతలకు పోటీచేసే అవకాశం టీడీపీ కల్పిస్తూ వచ్చింది. 2009లో పోటీచేసి ఓడిపోయిన డేవిడ్‌రాజు 2014 ఎన్నికల నాటికి వైసీపీలో చేరారు. టీడీపీ అజితారావును అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఆ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆమె పెత్తనం ప్రారంభమైంది. వెంటనే నియోజకవర్గంలో ఉన్న స్థానిక నాయకులు ముఖ్యంగా ఒక సీనియర్ నేత అండతో ఆమెకు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారంభించారు. అప్పట్లో అజితారావు వైపు నుంచి సమస్యలు ఉండటంతో ఆమెను తొలగించి స్థానిక నాయకుల్లో ముగ్గురిని త్రిసభ్య కమిటీగా టీడీపీ ఏర్పాటు చేసింది. 2019 ఎన్నికల నాటికి అభ్యర్థి కరువవ్వడంతో అజితారావును మళ్లీ తెచ్చి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి తర్వాత మళ్లీ ఆమె కనుమరుగయ్యారు. పార్టీపై స్థానిక నాయకులు పెత్తనం చేయడం ప్రారంభించారు. టీడీపీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా పార్టీ సీనియర్ అయిన ఎరిక్షన్‌బాబుకు సాధారణ ఎన్నికలకు మూడేళ్లు ముందుగానే ఎర్రగొండపాలెం బాధ్యతలు అప్పగించి అక్కడికి పంపింది. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఆయన ఓటమి చెందారు. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జిగా హవా సాగిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ మురళి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను ప్రజలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ ఎం.మురళి సూచించారు. దర్శిలోని చైతన్య పాఠశాలలో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ యువత అతి వేగంతో వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదా లకు గురై ఎంతో విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తాచాటిన వ్యవసాయ కళాశాల విద్యార్థి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎస్ పురం మండలంలోని కదిరిబాబురావు వ్యవసాయ కళశాల కు చెందిన మునయ్య అనే విద్యార్థి షాట్ పుట్‌లో ప్రథమస్థానం సాధించాడు. శ్రీకాకుళం జిల్లాలోని నైరా వ్యవసాయ కళాశాలలో జరిగిన అంతర కళాశాలల క్రీడా పోటీలలో కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మూడవ సంవత్సరం చదువుతున్న మునయ్య షాట్‌పుట్‌లో సత్తాచాటి మొదటి స్థానం సాధించాడు.



మునయ్యకు కప్ అందజేస్తున్న శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పంచాయతీలోని అన్నిప్రాంతాల్లో నూరుశాతం సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేస్తామన్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందిం చేందుకు ఇంటింటికి కొళాయి పథకాన్ని అమల్లోకి తెస్తామన్నారు. అమృత పథకం అమలుకు సమావేశం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పింఛన్‌ను వినియోగించుకోవాలి

» ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులు పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. 1వ తేదీ ఆదివారం రావడంతో ముందుగానే శనివారం పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మండల పరిధిలో తోటవారిపాలెం, బుర్లవారిపాలెం గ్రామాల్లోను, చీరాల మున్సిపల్ పరిధిలోని 10, 11 వార్డుల్లో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పేరాల మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముత్యాలపేట వీవీ స్పెషల్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హ యాంలో జగన్ బటన్ నొక్కుతున్నాననంటూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని గాడిలో పెట్టేందుకు నిర్విరామంగా పనిచేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం నినాదాలతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఆయా ప్రాంతాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



పంగులూరులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

అద్దంకి మండలంలో 96 శాతం పంపిణీ

అద్దంకిటౌన్ : లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బత్తిని సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనంపాడు, నాగులపాడు గ్రామాలల్లో జరుగున్న పింఛన్‌ల పంపిణీని ఆయన పరిశీలించారు. శనివారం మండలంలో 96శాతం పంపిణీ చేసి, బాపట్ల జిల్లాలో మొదటి స్థానంలో అద్దంకి ఉందని సింగయ్య తెలిపారు.

పంగులూరు : మండలంలో శనివారం 93 శాతం పింఛన్‌లను పంపిణీ చేశారు. 21 గ్రామ పంచాయతీలలో 7,862 మందికిగాను 7,310 మందికి పింఛన్ ఇచ్చినట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో శనివారం సాయంత్రానికి 94 శాతం పింఛన్‌ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో కె. కుసుమకుమారి తెలిపారు. మండలంలో 7646 మందికి గాను 7204 మందికి అందించామని మిగిలిన వారికి వెంటనే అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో పేర్కొన్నారు.

చినగంజాం : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చినగంజాం, కడవకుదురు, మున్నంవారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, పల్లెపాలెం తదితర గ్రామాల్లో పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో 5901 మందికి గాను 5670 మందికి పింఛన్ పంపిణీ చేసి 97శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.



పల్లెపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసమూర్తి



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పొలిమేర వీరాంజనేయస్వామికి పూజలు

ఇంకొల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరు పొలిమేర వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి ప్రత్యేక ఆకు పూజను చేసారు.

మెలకువలతో విద్యార్థులను తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంవో మోజెస్

చీరాలటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శిక్షణలో తెలుసుకున్న మెళకువలతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఏఎంవో మోజెస్ అన్నారు. గత సోమవారం నుంచి శనివారం వరకు వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో 1,2 తరుగతుల విద్యార్థులకు బోధన అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన 266 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. చివరి రోజు శనివారం ముగింపు సమావేశం ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా జిల్లా ఏఎంవో మోజెస్, స్టేట్ అబ్జర్వర్ మాధవీలత మాట్లాడారు. కార్యక్రమంలో సాల్ట్ ప్రతినిధి రాజశేఖరరెడ్డి, సుభాని, ఏఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

మెరుగైన చికిత్సకు లోకేష్ ఆదేశం

బల్లికురవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాసరావుచౌదరి శనివారం అప్పుల బాధలతో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు.. గొర్రెపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే యువకుడు కొంత కాలంగా ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాడు. గతంలో నారా లోకేష్ టీంలో పనిచేసి ఈ మధ్య కాలంలో స్వగ్రామానికి చేరాడు. అ వివాహితుడైన శ్రీనివాసరావుకు అప్పులు బాగా పెరిగాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక తన ఇంటిలోనే పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసరావును గుర్తించిన కుటుంబ సభ్యులు చిలకలూరిపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. విషయాన్ని వారి బంధువులు మంత్రి లోకేష్ టీం దృష్టికి, మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేష్ వెంటనే టీడీపీ కార్యకర్త శ్రీనివాసరావుకు మెరుగైన చికిత్సను అందించాలని తన టీం సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసరావు అరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు సమాచారం.

పరామర్శించిన హర్షవర్ధన్

చిలకలూరిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాస్‌చౌదరిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ పరామర్శించారు. వైద్యులను అడిగి శ్రీనివాస్ చౌదరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే ఏర్పాటు చేయాలన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

లారీని బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు కెమికల్ పౌడర్ లోడు చెన్నై నుంచి ఒడిశా వెళ్తున్న లారీని పులివెందుల నుంచి విజయవాడ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ముప్పవరం ఫ్లైవోవర్‌పై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న విజయవాడ బెంజిసర్కిల్‌కు చెందిన బండారు కీర్తి, పులివెందుల మండలం మల్లెల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ, రేపల్లెకు చెందిన వైష్ణవికి గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. పోలీసులు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ^ర్యలు చేపట్టారు.

వెలగని వీధి దీపాలు

మేదరమెట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో వీధి దీపాలు వెలగడం లేదు. నాలుగు నెలలుగా వీధి దీపాలు వేలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్‌లోని పాత మద్రాస్ రోడ్డులో రహదారులు, భవనాల శాఖ రెండు సంవత్సరాల కిందట వీధి దీపాలను ఏర్పాటు చేసింది. పాత చెక్ పోస్టు సెంటర్ నుంచి పాత గుంటూరు రోడ్డులోని పాత మార్కెట్ సెంటర్ వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బస్టాండ్ ముందు డివైడర్ లేకపోవడంతో అక్కడ లైట్లు వేయలేదు. వేసిన సంవత్సరానికే కొన్ని బల్బులు పోయాయి. ముఖ్యంగా మేదరమెట్ల కూడలిలో ఏర్పాటు చేసిన లైట్లు వెలగకపోవడంతో సెంటర్‌లోకి వచ్చి వెళ్లేవారు, దుకాణాల వారు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి 10 గంటల తరువాత ఈ ప్రాంతమంతా చీకటిగా ఉంటుంది. రాత్రివేళ వేరే ప్రాంతాల నుంచి మేదరమెట్ల వచ్చేవారు లైట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా లైట్లు లేకపోవడంతో అవి సక్రమంగా పని చేయడం లేదని దుకాణ యజమానులు అంటున్నారు. చుట్టుపక్కల ప్రాం తాలకు మేదరమెట్ల కూడలి కావడంతో ఇక్కడ విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త లైట్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



మేదరమెట్లలో వెలగని వీధి దీపాలు

తండ్రిని హత్య చేసిన కొడుకు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తండ్రి ముప్పరాజు వెంకటే శ్వర్లును హత్య చేసిన కుమారుడు సుబ్బారావును శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం కశ్యాపురానికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు కుటుంబం అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్ 3వ లైన్‌లో ఉంటున్నారు. భార్య 20 సంవత్సరాల కిందట, తల్లి రెండెళ్ల క్రితం మృతి చెందారు. దీంతో తండ్రి, కొడుకులు మాత్రమే ఉంటున్నారు. లారీ క్లీనర్ గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు కశ్యాపురంలో ఉన్న 80 సెంట్ల స్థలాన్ని 9 లక్షలకు అమ్మి వచ్చిన డబ్బుతో తండ్రీకొడుకులు జీవనం సాగిస్తున్నారు. కుమారుడు సుబ్బారావు మద్యానికి బానిసయ్యాడు. డబ్బు విషయమై ఇద్దరి మధ్యా తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి తండ్రి, కొడుకులు గొడవ పడ్డారు. తండ్రి వెంకటేశ్వర్లును కుమారుడు సుబ్బారావు బలంగా కొట్టడంతో రక్తస్రావం కావడంతో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. సుబ్బారావును శనివారం కలవకూరు క్రాస్ రోడ్స్ వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

పర్చూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్చూరులోని జూనియర్ కళాశాలలో డేటా ఎం ట్రీ ఆపరేటర్ కోర్సుకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నేపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ, యువతీ, యువకులు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు నిరుద్యోగులు డిసెంబర్ 2లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 6302764962 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు

చీరాలటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని వారిపట్ల సానుభూతితో మెలగాలని పలువురు మహిళా మండలి ప్రతినిధులు అన్నారు. ఆదివారం వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. రోగ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వెంకటరావు, ఫ్యామిలీ కౌన్సెలింగ్, వృద్ధాశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహనతో నిర్మూలనకు కృషి చేయాలని డాక్టర్ వెంకట కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి సీహెచ్‌సీలో రోగులకు అవగాహన కల్పించారు. డాక్టర్ వెంకట కిరణ్, డాక్టర్ అనితా జ్యోతి వ్యాధి వ్యాప్తి, నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఓబుల్ రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్, సంస్థ సభ్యులు కరుణ, మల్లేశ్వరి, శివపార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా శనివారం మార్టూరు సెంటర్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, రోటరీక్లబ్ వారు, హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ విష్ణుతేజ, వైద్యులు అశోక్ రెడ్డి, భానుచంద్రనాయుడు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో నిర్మాణం ప్రభుత్వానిదే

» మాజీ మంత్రి గాదె



మాట్లాడుతున్న గాదె

ఇంకొల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో ఆర్టీసీ డిపో నిర్మాణం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని పావులూరులో ఆయన స్వగృహంలో విలేకరులతో మా ట్లాడారు. శనివారం మండలంలోని నాయకులు గాదెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇంకొల్లులో ఆర్టీసీ డిపో నిర్మాణం చేసేందుకు పావులూరు రోడ్డులో స్థలాన్ని కేటాయించి శంకుస్థాపన చేసినట్లు ఆయన గుర్తు చేశారు. డిపో నిర్మిస్తే ఇంకొల్లు చుట్టుపక్కల సమారు 140 గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



పోలీసులకు సూచనలు ఇస్తున్న న్యాయాధికారి శాంతి

పర్చూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజీ మార్గంలో ఇరువర్గాలు కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందని, దీనిపై అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.శాంతి అన్నారు. శనివారం కోర్టు భవనాల సముదాయంలో డిసెంబర్ 14న నిర్వహించే లోక్‌అదాలత్‌పై పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి శాంతి మాట్లాడుతూ ఎవరినీ బలవంతంగా రాజీ పడేలా మాట్లాడవద్దని పోలీసు అధికారులకు సూచించారు. ఇరువురి అంగీకారంతోనే కేసులను పరిష్కరించాలన్నారు. లోక్ అదాలత్ వల్ల డబ్బుతోపాటు, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ సమీక్షలో కాంచేడు, ఇంకొల్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

20 నిమిషాలలో 44 అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ సమావేశం శనివారం మొక్కుబడిగా జరిగింది. చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన 44 అంశాలను ఆమోదించారు. 20 నిమిషాలలో అన్ని అంశాలు చదవడం పూర్తి కాగా, చైర్ పర్సన్ ఎస్తేరమ్మ ఆమోదించినట్లు ప్రకటించారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్‌లలో ఏ ఒక్కరూ నోరు విప్పలేదు. ఏ ఒక్క అంశం పైనా చర్చ చేయలేదు. కనీసం ప్రజా సమస్యలను కూడా కౌన్సిల్‌లో చర్చించకపోవడం విమర్శలకు తావిస్తుంది. వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో శుక్రవారం రాత్రి అధికారులతో కలసి విఠలేశ్వర్ పల్లెనిద్రను చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో జరిగిన సమావేశంలో ఏఎస్పీ వారి సమస్యలను తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలు, చెడు వ్యసనాలతో ఉన్న వ్యక్తుల సమాచారం తెలుసుకున్నారు. సమాజంలో సైబర్ నేరాలు జరిగే తీరును వివరించిన ఏఎస్పీ ప్రజలు వాటిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. రోడ్డు ప్రమాదాలబారిన పడకుండా పాటించాల్సిన నిబంధనలు, ప్రయాణ సమయంలో హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. మహిళలు, చిన్నారులకు పోలీస్ రక్షణగా ఉంటుందని, ఎవరైన వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని విఠలేశ్వర్ హెచ్చరించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు, 112 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు.కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ వినోద్‌బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.



భగవద్గీత పుస్తకాలతో బాలికలు

జ్ఞానాన్ని పెంచే భాండాగారం భగవద్గీత

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత విద్యార్థుల మేధస్సును పెంచే జ్ఞాన భాండాగారం అని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరారావు అన్నారు. మండలంలోని ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం భగవద్గీత పుస్తకాలను అందచేశారు. ప్రతి వ్యక్తి చదవాల్సిన మంచి పుస్తకం భగవద్గీత అని ఆయన సూచించారు. కార్యక్రమంలో దాస సాహిత్య మండల కోఆర్డినేటర్ ధూళిపాళ్ల పార్వతి, అన్నాబత్తిన అరుణ, పాఠశాల హెచ్‌ఎం. పుచ్చకాయల ప్రసాద్, జాగర్లమూడి కవిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత

మార్టూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమంలో శనివారం రోటరీ క్లబ్ సభ్యులు రమణ అనే మహిళకు కుట్టుమిషన్ అందచేశారు. ఆశ్రమంలో గత 3 నెలలుగా మహిళలకు కుట్టు మిషనులో శిక్షణ ఇచ్చారు. వారి శిక్షణ పూర్తికావడంతో 26 మందికి సర్టిఫికెట్లను ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందు ఆధ్వర్యంలో అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రావుల బాపయ్య సాయం అందజేశారు. కార్యక్రమంలో రావి అంకమ్మచౌదరి, మద్దుమాల కోటేశ్వరరావు, సాంబశివరావు, ఆంజనేయులు, కంటి వైద్యుడు కె సుబ్రమణ్యం, షేక్ కాజా హుస్సేన్ పాల్గొన్నారు.

ఆహార నియమాలతోనే ఆరోగ్యం

చీరాలటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆహార నియమాలతో ఆనందంగా జీవిస్తారని గుండె వైద్య నిపుణడు డా.ఐ.బాబూరావు అన్నారు. స్థానిక ఉడ్ నగర్‌లోని ఆనంద నిలయం ప్రభుత్వ వసతి గృహంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గుండె, దంత పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఆహారం, ఏ సమయంలో తినాలి, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డా.ప్రదీప్, సాదిరెడ్డి, ఐ.సుభాషిణి, వార్డెన్‌లు సుజాత, ఆనందకుమారి పాల్గొన్నారు.



ప్రభాకర్‌రెడ్డి, గిరిజ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

పాత్రలతో అందరికీ గుర్తుండి పోతారు

అద్దంకిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సినిమాలలో నటులు తమకు ఇచ్చిన పాత్రలతో అలరించి ప్రజల మనస్సులో ఎల్లప్పుడూ గుర్తుండి పోతారని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. శనివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభ మూర్తులు - మధురస్మృతుల సభ జ్యోతి చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సినీ నటులు ప్రభాకర్‌రెడ్డి, మరో నటి గిరిజ చిత్రపటాలకు సభ్యులు నివాళులర్పించారు. ప్రభాకర్‌రెడ్డి నటించిన చిత్రాలు, ప్రాధాన్యతను దాసరి లక్ష్మి, నటి గిరిజ గురించి గ్రంథి నాగరాజ కుమారి ప్రసంగించారు. కార్యక్రమానికి సీతారామశాస్త్రి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, అన్నమనేని వెంకట్రావు, ఆర్‌వీ రాఘవరావు, డాక్టర్ దేవపాలన, చందలూరి నారాయణరావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చీరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలకు చెందిన వారికి సంబంధించి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య శనివారం పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. చుక్కా నాగవెంకట్ (గంజి పాలెం)కు రూ.88,478, వెంకటసాయి మణికంఠ (పాపరాజుతోట) రూ.1,00,516, రామేశ్వరం అభినవ్(ఈపురుపాలెం) రూ.2.50లక్షలు, చల్లా శ్రీనివాస్(విఠల్‌నగర్) రూ.88,346, నర్రా ఆంజనేయులు (గవినివారిపాలెం)రూ.52,292, బీ శ్రీనివాసరావు (హరిప్రసాద్‌నగర్) రూ.28,848, ఎనుములు మల్లేశ్వరి (బుర్లవారిపాలెం), రూ.20వేల చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు కార్తీక వనభోజనాలు

ఇంకొల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రాహ్మణులకు శనివారం కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలను ఏర్పాటు చేశారు 300 మందికిపైగా బ్రాహ్మణులు హాజరయ్యారు.

ఈపూరుపాలెంలో పలుచోట్ల చోరీకి యత్నం

- పలు దుకాణాల తలుపులు పగులగొట్టిన దుండగుడు
- మీ సేవా కేంద్రంలో రూ.40వేల అపహరణ
- సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు
- తూర్పుగోదావరి వ్యక్తిగా గుర్తింపు
- పాత దొంగగా ఆనవాళ్లు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి పలు దుకాణాల్లో చోరీలకు యత్నించాడు. దర్జాగా దొంగతనానికి ఉపయోగకరంగా ఉండే విధంగా లైటును తయారు చేసుకొని పలు దుకాణాల తలుపులను ఓపెన్ చేసి విఫలమయ్యాడు. అయితే మీ సేవా కేంద్రంలోకి చొరబడి రూ.40వేలు నగదును అపహరించాడు. ఉదయాన్నే విషయం తెలుసుకున్న సెంటర్ నిర్వాహకుడు కాటూరి చెంబయ్య దుకాణంలో వస్తువులు చిందరవందరగా ఉండడమే కాకుండా నగదు అపహరణ అయినట్లు గుర్తించారు. వెంటనే ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ క్లూస్ టీం సహాయంతో ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు.



సీసీ పుటేజీకి చిక్కిన చోరీకి పాల్పడిన దుండగుడు

నిందితుడిని ఇప్పటికే పసిగట్టిన పోలీసులు

చోరీలకు పాల్పడిన వ్యక్తిని సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఇతని వయసు సుమారు 40 ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఇతడు గతంలోనూ పట్టణంలో పలు చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈక్రమంలోనే గాలింపు చర్యలు ప్రారంభించారు.



క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు